



కావలిలో శుక్రవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు

ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తాం

- ఉదయగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉంది. మేము అధికారంలోకి రాగానే ఇంటింటికి కొళాయి కనెక్షన్ ద్వారా మంచినీటిని సరఫరా చేసి ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తాం. ఫ్లోరైడ్ బాధితులు కిడ్నీ, డయాలసిస్ సమస్యలతో బాధపడుతున్న బాధితులను ఆదుకొంటాం.
- వెలుగొండ ప్రాజెక్టు, నార్త్ కెనాల్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులను పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి తాగు, సాగునీరు అందిస్తాం. పోలవరం పూర్తి చేసి తద్వారా నదులను అనుసంధానించి ఉదయగిరిని సస్యశ్యామలం చేస్తాం.
- పాలిటెక్నిక్ కళాశాలను పూర్తి చేస్తాం. షాదీమంజిల్ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తాం.
- వింజమూరులో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మిస్తాం. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం.
- ఉదయగిరికి పరిశ్రమలు తీసుకొచ్చి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

రానున్న ఎన్నికల్లో గెలుపు పట్ల కావలి, వింజమూరు ప్రజాగళం బహిరంగ సభల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను పరిచయం చేస్తూ ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల అక్రమాలు, అవినీతి వ్యవహారాలను ఎండగట్టారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు ఎంత అవసరమో వివరిస్తూ చంద్రబాబు చేసిన ప్రసంగానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన లభించింది.

కావలి అభివృద్ధికి కృషి చేస్తా

కావలి నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారంతోపాటు కావలి అభివృద్ధికి కృషిచేస్తా. కావలి కాలువ, డీఆర్ చానల్, డీఎం చానల్ పనులు పూర్తిచేసి కావలి నియోజకవర్గంలో సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తా. సంగం బ్యారేజీ నుంచి కావలి ఎస్‌ఎస్ ట్యాంకు పైపులైన్ నిర్మాణం పూర్తిచేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తా. కావలి- తుమ్మల పెంటరోడ్డు, పెదపవని రోడ్డులోని ఆర్వోబీ వంతెన నిర్మాణం పూర్తి చేయిస్తా. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకున్నాం. రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తు బాధ్యత మాది, మమ్మల్ని విశ్వసించి ఎన్‌డీఏ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కావలి, ఉదయగిరి అభ్యర్థులు కావ్యకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్‌ను గెలిపించండి.

అరాచక, దోపిడీపాలన విముక్తికే

వైసీపీ అరాచక, దోపిడీపాలన నుంచి విముక్తి కల్పించేందుకే చంద్రబాబు నాయుడు ప్రజాగళం శంఖారావాన్ని పూరించారు. సాగునీటి సమస్య పరిష్కారం కోసం కావలి కాలువ, డీఆర్, డీఎం చానల్‌కు గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేస్తే పెండింగ్ పనులు పూర్తి చేయలేదు. ఎక్కడైనా ఒక్క రోడ్డు అయినా వైసీపీ పాలనలో నిర్మించారా!?

- బీద రవిచంద్ర, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలి

చంద్రబాబు నాయుడితోనే యువతకు ప్రాధాన్యం పెరుగుతుంది. అందుకే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలి. యువతకు ఏటా 4 లక్షల ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి చంద్రబాబును గెలిపించుకోవాలి

- వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి

చంద్రబాబుతోనే అభివృద్ధి

టీడీపీ ప్రభుత్వంలోనే కావలి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుంది. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి విమానాశ్రయంను కావలికి మంజూరు చేయించింది చంద్రబాబునాయుడే. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటే కావలి సమగ్రాభివృద్ధి జరుగుతుంది.

- కావ్య కృష్ణారెడ్డి, కావలి అభ్యర్థి

యువతకు ఉపాధి కల్పిస్తా

ఉదయగిరి నియోజకవర్గం కరువు కాటకాలతో నీరు లేక ఏడారిలా మారింది. టీడీపీ అధికారంలోకి రాగానే తాగు, సాగునీటి కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తా. పరిశ్రమల ద్వారా 10 వేల మందికి ఉపాధి కల్పిస్తా. టూరిజం ద్వారా ఉదయగిరి దుర్గం, నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తా. వింజమూరు పట్టణానికి సమ్మర్ స్టోరేజీ తీసుకొచ్చి ప్రతి ఇంటికి మినరల్ వాటర్ అందించేందుకు కృషి చేస్తా.

- కాకర్ల సురేష్, ఉదయగిరి అభ్యర్థి

అజాత శత్రువు వీపీఆర్..

నెం.2 దొంగ విజయసాయి!

- కావలి కాలకేయుడు వైసీపీ అభ్యర్థి
- ఆయనకు సరైన మొగుడు మా కృష్ణారెడ్డి
- వీరి ఎన్నిక లాంఛనప్రాయమే!
- ఉదయగిరి అభివృద్ధికి కాకర్లను గెలిపించండి
- కావలి, వింజమూరు సభల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు

నెల్లూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : కావలి సభలో నెల్లూరు పార్లమెంట్, కావలి అభ్యర్థుల పరిచయ క్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంతోనే నెల్లూరు ఎంపీ స్థానం గెలిచామన్నారు. 'నెల్లూరు ఎంపీ మనదే. జూన్ 4వ తేదీ వరకు చూడాల్సిన అవసరం లేదు. ప్రభాకరరెడ్డి అజాత శత్రువు. ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి గుర్తింపు తెచ్చే వ్యక్తి. అలాంటి వ్యక్తి టీడీపీలోకి వచ్చాడంటే అందుకు గర్వపడుతున్నా. ఆయనపై పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డి అత్యంత అవినీతిపరుడు. ఏ2 నేరస్థుడు పనికిమాలిన వ్యక్తి, ఒక దళారి వ్యవస్థకు మూలస్తంభం లాంటి విజయసాయిరెడ్డి పోటీ చేస్తున్నాడు. ఈ ఇద్దరు ఎంపీ అభ్యర్థుల మధ్య తేడా గుర్తించిన ప్రజలు విజయసాయి మొహం చూడటానికి కూడా ఇష్టపడం లేదు. నిన్ననే ఒక సభలో అమ్మా..! వెళ్లిపోకండి, భోజనాలు కూడా ఉన్నాయి అని మైకులో ప్రాధేయపడుతున్నా ప్రజలు పారిపోయారంటే ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో అర్థం అవుతోంది. జగన్.. నీ ఎంపీ అభ్యర్థి విశ్వసనీయత అది. మా ఎంపీ అభ్యర్థి విశ్వసనీయత ఇది." అంటూ చంద్రబాబు తమ అభ్యర్థులను గొప్పగా పరిచయం చేసుకున్నారు. కోవూరు నుంచి ప్రభాకరరెడ్డి సతీమణి ప్రశాంతి రెడ్డి పోటీ చేస్తున్నారని, ఒక ఆడబిడ్డ పోటీ చేస్తుంటే ఆమెను కించపరుస్తూ పోస్టింగులు పెడుతున్నారని, ఉన్మాదుల్లా మారి అరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు. వారి అరాచకాలు ఎంతో కాలం సాగవని, ఓటుతో మీకు పుట్టగతులు లేకుండా చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు హెచ్చరించారు.



అభ్యర్థులు వేమిరెడ్డి, కావ్యలను పరిచయం చేస్తూ మాట్లాడుతున్న చంద్రబాబు



వింజమూరు : రోడ్‌షోలో అభివాదం చేస్తున్న చంద్రబాబు, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్

● వైసీపీ అభ్యర్థి చిన్నపాటి సైకో

'కావలిలో ఒక కాళకేయుడు ఉన్నాడు. ఈ వైసీపీ ఎమ్మెల్యే ఒక చిన్నపాటి సైకో. ఇలాంటివాడ్ని నేను ఇప్పటి వరకు చూడలేదు, ఈయనొక వింతజీవి' అని కావలి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డిపై చంద్రబాబు విమర్శలు గుప్పించారు. 'ఈయన జగనన్న ఇళ్ల జాగాల పేరుతో రూ.100 కోట్లు కొట్టేశాడు. ప్రజల భూములనూ లాగేసుకున్నాడు. ప్రజలు భూమి కొనాలన్నా, అమ్మాలన్నా ఈయనకు లంచం ఇవ్వాల్సిందే. లే అవుట్ వేస్తే గద్దలా వాలిపోతారు. నియోజకవర్గ పరిధిలోని కొండలు, గుట్టలు అన్నీ చదరం చేసేసి గ్రావెల్ అమ్మకాల్లో రూ.కోట్లు వెనకేసుకున్నాడు. ఇలాంటి అన్యాయాలు చేసే వ్యక్తి ఉండాల్సింది ఇక్కడ కాదు. ఎక్కడ ఉండాలో అక్కడికి పంపిస్తా. కాళకేయా ఎగిరిపడొద్దు, నిన్ను ఢీ కొట్టడానికి సరైన వ్యక్తిని దించాం. నీకు కరెక్టు మొగుడు కావ్య కృష్ణారెడ్డి. నువ్వు తిన్నది మొత్తం కక్కిస్తాం. ప్రజల నుంచి నువ్వు కొల్లగొట్టిన ఆస్తిపాస్తులు తిరిగి వారికి ఇప్పిస్తాం

● నేను వేసిన ఐటీ బీజం నుంచి ఎదిగిన వ్యక్తి కాకర్ల

ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకార్ల సురేష్ నేను వేసిన ఐటీ బీజం నుంచి ఎదిగిన వ్యక్తి. నేను రాష్ట్రానికి ఐటీ రంగాన్ని పరిచయం చేసిన క్రమంలో కాకర్ల ఆ రంగంలోకి ప్రవేశించారు. కష్టపడి ఎదిగారు. సాధారణ ఉద్యోగిగా విదేశాల్లో అడుగుపెట్టి పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. పుట్టిన గడ్డకు సేవ చేయాలనే మంచి ఆశయంతో ఇక్కడికి వచ్చారు. తన సొంత నిధులతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వైద్య సేవలు అందిస్తున్నారు. వెనుకబడిన ఉదయగిరిలో పరిశ్రమలు స్థాపించాలన్నది ఆయన ఆకాంక్ష. ఎంపీ అభ్యర్థి వీపీఆర్‌కు పారిశ్రామిక రంగంలో అనుభవం ఉంది. వీరిద్దరి కలయికతో ఈ నియోజకవర్గంలో పరిశ్రమలు వస్తాయి. అందుకు నేను సహకరిస్తాను. వీరిని ఆశీర్వదించి గెలిపించండి, ఉదయగిరిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా"మని చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు.



మాలకొండ హుండీల ఆదాయం రూ.80,37,644

వలేటివారిపాలెం : పుణ్యక్షేత్రం మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి 21 హుండీల ద్వారా 13 శనివారాలకు రూ.80,37,644 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. మాలకొండ ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో కందుకూరు గ్రూపు ఆలయాల ఈవోలు భైరాగిచౌదరి, రవీంద్రనాథ్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీల లెక్కింపు జరిగింది. హుండీలలో నగదుతోపాటు 185 గ్రాముల బంగారం, 1.08 కిలోల వెండి, 76 యూఎస్‌ఏ డాలర్లు, 100 ఆస్ట్రేలియా డాలర్లు, 200 యూఏ దైన్‌మెస్ లభించినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

హోరెత్తిన 'ప్రజా'గళం

● చంద్రబాబు సభలకు భారీగా జనం ● కావలి, ఉదయగిరి నేతలతో ప్రత్యేక భేటీ

ప్రజాగళం పేరుతో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం జిల్లాలో చేపట్టిన సభలకు అనూహ్య స్పందన లభించింది. కావలి, ఉదయగిరి నియోజకవర్గం వింజమూరులో నిర్వహించిన సభలకు ప్రజలు పోటెత్తారు. ఈ రెండు సభలు టీడీపీ, బీజేపీ, జనసైనికుల్లో సమరోత్సాహాన్ని నింపాయి.

నెల్లూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడిన ఎన్నికల వేళ బాధ్యతాయుతమైన నాయకునిగా చంద్రబాబు ప్రసంగించారు. పాలక పక్షంపై విమర్శలకే పరిమితం కాకుండా ఆ విమర్శలకు సహేతుకమైన కారణాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి హామీలిచ్చారు. మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించడం ద్వారా ప్రజామోదాన్ని పొందగలిగారు. వైసీపీ ప్రభుత్వ విధానాలపై ప్రజలకు ప్రశ్నలు సంధించి వారి నుంచి సమాధానం రాబట్టడా నికి ఎక్కువగా ప్రయత్నించారు. ప్రజలకు కూడా గతానికి భిన్నంగా స్పందించి పెద్ద గొంతుకతో సమాధానం ఇవ్వడం సానుకూల అంశంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, పక్కపక్కనే ఉన్న కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో వెంటవెంటనే జరిగిన రెండు బహిరంగ సభలకు ప్రజలు వేల సంఖ్యలో తరలిరావడం విశేషం. వింజమూరు సభ సుమారు రెండు గంటలు ఆలస్యమైనా అక్కడి ప్రజలు చంద్రబాబు కోసం ఓపిగ్గా నిరీక్షించారు. రెండు చోట్ల చంద్రబాబు ప్రసంగానికి యువత, మహిళలు పెద్ద ఎత్తున స్పందించడం గమనార్హం.



వింజమూరు సభకు హాజరైన ప్రజలు

● బొల్లినేనికి బుజ్జగింపు

ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావుతో చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వింజమూరు సభ అనంతరం ఉదయగిరి, కావలికి చెందిన పలువురు ముఖ్య నాయకులతో వేరువేరుగా సమావేశయ్యారు. బొల్లినేని రామారావు, చెంచల బాబు యాదవ్‌తో సుమారు 30 నిమిషాలు మాట్లాడారు. బొల్లినేని రామారావు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. అందుకు గల కారణాలను చంద్రబాబుకు వివరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో రామారావు రాజకీయ భవిష్యత్తుకు చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు సమాచారం. అధికారం లోకి రాగానే జాతీయ స్థాయిలో గుర్తింపు ఇస్తానని, ఎన్నికల్లో కష్టపడి పనిచేసి కాకర్ల సురేష్‌ను గెలిపించుకురావాలని చంద్రబాబు కోరారు. ఈ భేటీ అనంతరం రామారావు సంతృప్తిగా ఉన్నారని, త్వరలోనే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి. కాగా, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు. శనివారం ఉదయం ముఖ్య నాయకులతో చంద్రబాబు కాసేపు సమావేశం అవుతారని తెలిసింది. ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజకర్గాల్లోని చిన్న చిన్న సమస్యలను సర్దుబాటు చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

వాహనానికి ముసుగేశారు..

వైసీపీ రంగులదిద్దిన వాహనానికి ముసుగు వేసి షెడ్‌లో ఉంచారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'ఈ రంగుల మాటేమిటి' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన మండల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి, ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలకు చేరుకొన్నారు. అక్కడ కళాశాల డీన్ డాక్టర్ టీ.గోపికృష్ణతో చర్చించి వాహనానికి ముసు గులు వేయించి షెడ్‌లో ఉంచి తాళం వేయించారు.

- ఉదయగిరి రూరల్


ట్యాంకర్లతో వరి పంటకు నీటి సరఫరా..



ఓబులాయపల్లి సమీపంలో వరి పంటకు ట్యాంకరు నీటిని సరఫరా చేస్తున్న రైతు

ఆరుగాలం కష్టపడి అన్నం పెట్టే రైతన్నకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. బాధ్యతా యుతం లేని అధికారుల గత సంవత్సరం ఇష్టాసారంగా నీటిని వృథా చేయడంతో ఈ పంటకు తగినంత నీరు లేక దక్షిణ కాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. వరిపైరు కోత దశకు రావడంతో ఓబులా యపల్లి గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి పంటకు సరఫరా చేస్తున్నారు.

- చేజర్ల



భానుడి ఎఫెక్ట్!

సూర్యుడు నిప్పులు కక్కుతుండటంతో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. ఎండ తీవ్రతకు ప్రజానీకం బయటకి రావాలంటేనే జంకు తోంది. ఇక ప్రధాన రహదారులపై వాహన రాకపోకలు ఉదయం 10గంటలకే పూర్తిగా తగ్గిపోతున్నాయి. మధ్యాహ్నం పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వాతావరణంలో తేమశాతం తగ్గిపోయి వేడి విపరీతంగా పెరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయగిరిలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన సెంటర్లు శుక్రవారం మధ్యాహ్నం జనం లేక బోసిపోయాయి. వ్యాపారులు మధ్యాహ్నం సమయంలో ఎండ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పనుల కోసం వచ్చేవారు త్వరగా పనులు ముగించుకొని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత జనం బయటికి వస్తున్నారు.

- ఉదయగిరి

గ్రాసం కోసం పాకులాట



పశుగ్రాసం కొరతతో పాడి రైతులకు అవస్థలు తప్పటం లేదు. పశు సంవర్ధక శాఖ గణాంకాల ప్రకారం మర్రిపాడు మండలంలో 3,239ఆవులు, 21,859గేదెలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 4వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ క్రమంలో పాడి పశువులకు పశుగ్రాసం దొరక్క అల్లాడుతున్నారు. గతంలో వరి పంటను కూలీలు కోసేవారు. ఈ సమయంలో గడ్డి పుష్కలంగా దొరికేది. వరి కోతకు యంత్రాలు వాడటంతో పశుపోషకులకు ఎండి గడ్డి దొరకటం లేదు. యంత్రాలతో కోసిన గడ్డిని కొనుగోలు చేసినా ఒక్క ట్రాక్టరు గడ్డి రూ.12 నుండి రూ.13వేలు పలుకుతోంది. దూరప్రాంతాల నుంచి గ్రాసాన్ని కొనుగోలు చేయాల్సి వసస్తుండటంతో రశాణా ఖర్చులు మరింత భారంగా మారుతున్నాయి.

- మర్రిపాడు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

● శిలువ మోసిన నేతలు ● చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు



బిషప్‌హౌస్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 29 : జిల్లా వ్యాప్తం గా గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు 40 రోజులు ఉపవాస దీక్ష చేసి ప్రతిరోజు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. శుక్రవారం పలు చర్చిల ఆధ్వర్యంలో శిలువను మోసే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. అలాగే ప్రత్యేక ప్రార్థనలు హోరెత్తాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని శిలువను మోసి క్రైస్తవులకు గుడ్ ఫ్రై డే శుభాకాంక్షలు తెలిపారు.

● నెల్లూరులోని అన్ని చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి. బిషప్ హౌస్‌లో జరిగిన వేడుకల్లో టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు సిటీ, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థులు పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు నగర వైసీపీ అభ్యర్థి ఖలీల్ పాల్గొన్నారు. ఏసు శిలువ మార్గం సర్వ మానవాళికి శాంతి, సహనం, దయాగుణాలకు మార్గదర్శకం అన్నారు. నాయకులకు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం, చర్చి ఫాదర్లు స్వాగతం పలికారు.

● పత్తేఖాన్‌పేటలోని పునీత అంథోని చర్చిలో జరిగిన వేడుకల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.13లక్షల నగదు స్వాధీనం

సైదాపురం, మార్చి 29: స్థానిక పోలీస్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రూ.13లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజకుమార్ మాట్లాడారు. గూడూరు నుంచి సైదాపురం వైపు మేకలు, గొర్రెల లోడుతో వెళుతున్న వాహనంలో ఎలాంటి బిల్లుల పత్రాలు లేకుండా నగదును తరలిస్తుడటంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



నగుదును స్వాధీనం చేసుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్

హత్య కేసులో తల్లీకొడుకుల అరెస్ట్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

కావలి రూరల్, మార్చి 29: మండలంలోని తుమ్మలపెంట పంచాయతీ పెద్ద రాముడుపాలెం గ్రామానికి చెందిన కాటంగారి గోపాల్ హత్య కేసులో నిందితులైన తల్లీకొడుకులు బుచ్చంగారి మంగమ్మ, ఎర్రాలను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 19వ తేదీ రాత్రి పెద్దరాముడు పాలెంకు చెందిన కాటంగారి గోపాల్, బుచ్చంగారి ఎర్రాలు ఎర్రా ఇంట్లో మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న గోపాల్‌పై ఎర్రా పలు దఫాలు లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురైన గోపాల్ అక్కడి నుంచి బయటకు వెళితే ఈ విషయాన్ని గ్రామంలో చెప్పి తన పరువు తీస్తాడని భావించిన ఎర్రా ఎలాగైనా గోపాల్ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గోపాల్‌కు మరింత మద్యం తాపించి ఒక నైలాన్ తాడుతో కాళ్లు, చేతులు కట్టేసి మరో నైలాన్ తాడుతో గోపాల్ గొంతు బిగించి తల నేలకేసి బలంగా మోది హత్య చేశాడు. మృతదేహాన్ని మాయం చేసేందుకు ఇంటి వెనుక పడేసి ఎండిన కట్టెలు గోపాల్ మృతదేహంపై వేసి డీజల్ పోసి తగలబెట్టాడు. ఆ సమయంలో అలికిడితో వెనుక ఇంట్లో ఉండే ఎర్రా తల్లి మంగమ్మ అక్కడకు రావడంతో జరిగిన విషయం ఆమెకు చెప్పాడు. అనంతరం ఇద్దరు కలసి సగం కాలిన మృతదేహాన్ని మంగమ్మ ఇంటి పక్కన ఖాళీ స్థలంలో పూడ్చి వేశారు. అక్కడ ఎలాంటి వాసన రాకుండా బ్లీచింగ్ చల్లి పైన కట్టెల మోపులు ఉంచారు. గోపాల్ తల్లిదండ్రులకు ఎర్రాపై అనుమానంతో ఈ నెల 26వ తేదీ సాయంత్రం గోపాల్ బంధువులు ఎర్రా, మంగమ్మ ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించి మృతదేహం పూడ్చిన ఆనవాళ్లు గుర్తించారు. దీంతో విషయం బయటపడుతుందన్న భయంతో తల్లీకొడుకు పారిపో యారు. గోపాల్ తండ్రి గోవింద్ ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరిన పోలీసులు మృతదే హాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానితులుగా పరారీలో ఉన్న ఎర్రా, మంగమ్మలు వీఆర్వో హరిబాబు ఎదుట లొంగిపోయారు. వీఆర్వో వారిని పోలీసులకు అప్పగించగా నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన నైలాన్ తాడు, డీజిల్ క్యాను స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును త్వరగా ఛేదించిన రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావు, ఎస్ఐ రహంతుల్లా, సిబ్బందిని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉదయగిరి రూరల్, మార్చి 29: మండలంలోని సున్నవారి చింతల గ్రామ సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఉదయగిరికి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శని వారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఇత్తడి నారాయణ స్థానిక జలవన రుల శాఖ కార్యాలయ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఇసుక తరలింపునకు ఎలాంటి బిల్లులు లేక పోవడంతో ట్రాక్టర్‌ను సెబ్ అధికారు లకు అప్పగించి రూ.10 వేలు జరిమానా విధించినట్లు సెబ్ సీఐ ఎన్‌వీ రమణమ్మ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	142
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	278
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6508
వెండి కిలో ధర	రూ. 70,000
వెండి ఒక గ్రాము	రూ. 79.00

ఇద్దరు మహిళలపై దాడి

బుచ్చిరెడ్డిపాలెం, మార్చి 29: ఇద్దరు మహిళలపై మారణాయుధాలతో దాడిచేసిన సంఘటన మండలంలోని పాత మినగల్లులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దాచురు వెంకమ్మ అనే మహిళ తన పొలంలో చేతికందివచ్చిన వేరుశెనగ పంటను పెరుకుతుండగా ఆదే సమయంలో స్వయానా మరిది పంటలోకి నీళ్ల వదిలాడు. దీంతో నీళ్ల వదలడం వల్ల పంట తడిసిందని అడిగినందుకు మరిది దాచురి ప్రభాకర్, అతని భార్య కల్యాణిలు వెంకమ్మ, ఆమె కూతురిపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లికూతుర్లను చుట్టు పక్కల రైతులు బుచ్చిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విశ్వం పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ అవగాహన సదస్సు

తిరుపతి(విద్య), మార్చి 29: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఎ.పి.ఆర్.జె.సి నమూనా ప్రవేశ పరీక్షకు, అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించిందని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరై నమూనా పరీక్షలు రాశారని చెప్పారు. 2023 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థిని చరితశ్రీ 120కి గాను 119 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిందని వెల్లడించారు. అలాగే ఏపీఆర్జేసీ ఫలితాల్లో తనూజ, భువనేశ్వర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాకులను సాధించారని వివరించారు. పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్ తదితర కోర్సులు ఉంటాయని, మెరుగైన ర్యాంకు సాధించడం ద్వారా మంచి కళాశాలలో సీట్లతోపాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27 ఉంటుందని, ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన ఉంటుందని, మార్చి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 86888 88802, 9399976999లలో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలి



ఫ్లాగ్ మార్చ్‌లో పోలీస్ అధికారులు, బీఎస్‌ఎఫ్ జవాన్లు

పొదలకూరు, మార్చి 29 : ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్ఐ డి రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పొదలకూరు పట్టణంలోని సంగం రోడ్డు కూడలి నుంచి గేట్ సెంటర్ వరకు, అలాగే మండలంలోని చాటగొట్ల, మొగళ్లూరు గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవచ్చని, ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంబాబు, ఎస్ఐ రామకృష్ణ బీఎస్‌ఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రకటించిన జాబితాలో మీ పేరు లేదా!? జాబితాలో పేరు ఉన్నా మరో ప్రాంతానికి నివాసం మార్చారా!? మీపేరు, ఇతర వివరాలు తప్పుగా అచ్చు అయ్యాయా!? ఇలాంటి కారణాలతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటేయలేమని బాధపడుతున్నారా!? అయితే మీలాంటి వారి కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పిస్తోంది. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6, ఇతర ప్రాంతానికి ఓటు బదిలీ, పేరు, ఫొటో, ఇతర వివరాల దిద్దుబాటు కోసం ఫారం-8 దరఖాస్తులను ఏప్రిల్ 15వ తేదీ లోపు సమర్పిస్తే రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల సంఘం పిలుపునిస్తోంది.

ఓటుకు తుది అవకాశం

- బదిలీ, దిద్దుబాటుకు సైతం చాన్స్
- అర్హుల పేర్లతో త్వరలో అనుబంధ జాబితా
- రానున్న ఎన్నికల్లో ఓటేసేందుకు అవకాశం
- ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు

నెల్లూరు (విద్య), మార్చి 29 : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఐదేళ్లకు ఒకసారి పాలకులను ఎన్నుకునేందుకు ఓటర్లంతా సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో అసలు ఓటరుకు తన ఓటు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలి. లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలి. దీనికోసంగా ఎన్నికల సంఘం 15వతేదీ వరకు తుది గడువు కల్పించింది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియ ముగింపునకు 10 రోజుల నాటికి వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తు లను పరిశీలించి అర్హులైన వారికి ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది.



● ఓట్ల తొలగింపుతో గందరగోళం

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికారపార్టీకి చెందిన నేతలు ఉద్దేశపూర్వకంగా ఓట్లు తొలగించారని వందల సంఖ్యలో అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఫారం-7 ద్వారా తమకు నచ్చిన వారందరి పేర్లను జాబితాలో నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు చేశారని, ప్రతిపక్షాలు ఆందోళనలు చేయడంతో అధికారులు కొందరిపై కేసులు కూడా నమోదు చేశారు. వీరిలో కొంతమంది అర్హులకు ఓటుహక్కు కూడా కల్పించారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో ప్రజలు తమ పేరును పరిశీలించుకుని తమ ఓటు లేని పక్షంలో వెంటనే దరఖాస్తు చేసుకుంటే ఓటుహక్కు కల్పిస్తారు. గ్రామ, వార్డు, సచివాలయాల ద్వారా, ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

● దరఖాస్తు ఇలా.

● ఓటరు నమోదు, ఓటు బదిలీ, వివరాల దిద్దుబాటు తదితర సేవల కోసం కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ఓటర్స్ డాట్స్ ఈసీఐ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని కూడా ఈ సేవలను పొందవచ్చు.

● స్థానిక బూత్‌స్థాయి అధికారి (బీఎల్‌ఓ), ఓటరు నమోదు అధికారులకు దరఖాస్తును అందజేయాలి. ఓటరు నమోదు కోసం కొత్తగా దిగిన ఫొటోతోపాటు చిరునామా, వయసు ధ్రువీకరణ కోసం పదోతరగతి మార్కుల జాబితా, ఆధార్, రేషన్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు, పాస్‌పుస్తకాలు వంటి పత్రాలను సమర్పించాలి.

● ఓటరు జాబితాలో పేరు ఉందా లేదా అనేది తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఎలక్టోరల్‌సెర్చ్ డాట్ ఈసీఐ డాట్ జీఓవీ డాట్ ఇన్ అనే వెబ్‌సైట్‌ను నిర్వహిస్తోంది. ఓటరు వివరాలు, గుర్తింపు కార్డు(ఎపిక్), మొబైల్ నెంబర్ ఆధారంగా జాబితాలో పేరును సెర్చ్ చేయడానికి ఈ పోర్టల్ అవకాశం కల్పిస్తోంది.

సామాన్యుడి గొంతుక టీడీపీ

● పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో నేతలు



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 29 : తెలుగువాడి ఆత్మగౌరవానికి సామాన్యుడి గొంతుక తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పేద వాడి ఆకలి కేకలు, రైతన్నల ఆవేదన చూసి చలించి తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదలిరా అంటూ ఎన్టీఆర్ ఇచ్చిన పిలుపునకు 42 వసంతాలు పూర్తయ్యాయని చెప్పారు. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు వరకు దేశ, రాష్ట్ర రాజకీయాల్లో అనేక క్లిష్టపరి స్థితులు ఏర్పడినా గెలుపోటములు ఎదురైనా పార్టీని, నాయ కులను సమన్వయ పరచుకుంటూ ముందుకు సాగారని చెప్పారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కొండూరు పోలిశెట్టి, ధర్మవరం సుబ్బారావు, రాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుణ్యకోటి విమానంలో రంగనాథ పరబ్రహ్మ



పుణ్యకోటి విమానంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథుడు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 29 : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం ముసుగుల సేవ ఉత్సవం కనుల పండువా జరిగింది. గురువారం రాత్రి స్వామివారు దేవేరులకు చెప్పకుండా పారువేట కు వెళ్లడంతో కొత్త పెండ్లి కుమార్తెలైన శ్రీదేవి, భూదేవి స్వామిపై అలుగుతారు. ఈ ఘట్టాన్ని ముసుగుల సేవగా అర్చకులు ఆకట్టుకునేలా ప్రదర్శించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ పరబ్రహ్మ పుణ్యకోటి విమానంలో ఊరేగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

సోమశిలలో 10.073 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 29: సోమశిల పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి ప్రాజెక్టులో 10.073 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 920, దక్షిణ కాలువకు 250 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

కొత్త పథకాలకు బ్రేక్

- ఎన్‌డీసీసీబీపై ఎన్నికల కోడ్ ఎఫెక్ట్
- త్రిసభ్య కమిటీలకు వాహనాలు కట్
- రాజకీయ సభలు, ప్రచారాలపై ఆంక్షలు

నెల్లూరు(హరనాథపురం), మార్చి 29 : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ)కు ఎన్నికల ఎఫెక్ట్ తగిలింది. ఆ బ్యాంకులో ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఈ మేరకు ఆప్కాబ్ మార్గదర్శకాలను విడుదల చేసింది. జాతీయ బ్యాంకులతో పోలిస్తే ఎన్‌డీసీసీబీలో సేవింగ్స్ ఖాతాలకు, రికరింగ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లకు వడ్డీ ఎక్కువగా ఇస్తుంటారు. దీంతో ఆ బ్యాంకు లావాదేవీలు కూడా బాగున్నాయి. ఈ బ్యాంకు రైతుల కోసం ఏర్పాటైనా, సాధారణ ప్రజలు కూడా ఖాతాలు కలిగి ఉన్నారు. రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తున్నారు. ఎన్నో పథకాల ద్వారా ఖాతాదారులను ఆకర్షిస్తున్న ఎన్‌డీసీసీబీలో ఎన్నికల కోడ్ కారణంగా అధిక వడ్డీనిచ్చే కొత్త పథకాలు ప్రవేశపెట్టడానికి బ్రేక్ పడింది.



పర్సన్ ఇన్‌చార్జులకు వాహనాలు కట్

ఎన్‌డీసీసీబీలో త్రిసభ్య కమిటీ, డైరెక్టర్లు ఉన్నారు. సహకార వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా ఎన్నికలు జరగక పోవటంతో త్రిసభ్య కమిటీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒక సారి పర్సన్ ఇన్‌చార్జుల పాలనా కాలన్ని పొడిగిస్తోంది. ఆ కమిటీ సభ్యులు బ్యాంకు వాహనాలను ఉపయోగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలుతో కమిటీ సభ్యులు బ్యాంకు వాహనాలను ఉపయోగించరాదని ఆప్కాబ్ మార్గదర్శకాల్లో పేర్కొంది. నెల్లూరులోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయ ప్రాంగణం విశాలమైనది. దానిలో సాంస్కృతిక కార్యక్రమాలు, రాజకీయ సభలు, సమావేశాలు జరిగేవి. తాజా ఎన్నికల మార్గదర్శకాలతో బ్యాంకు ప్రాంగణా న్ని వసతి, రాజకీయ సమావేశాలకు వినియోగించరాదని ఆంక్షలు విధించారు. అంతేకాక బ్యాంకు వెబ్ అప్లికేషన్లలో ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రులు, రాజకీయ నాయకుల ఫొటోలను తక్షణమే తొలగించాలని ఆప్కాబ్ ఆదేశించింది. బ్యాంకు ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకి, అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించరాదని ఉత్తర్వుల్లో హెచ్చరించింది.

మార్గదర్శకాలను పాటిస్తాం



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సహకార బ్యాంకులు అనుసరించాల్సిన మార్గదర్శకాలను ఆప్కాబ్ విడుదల చేసింది. వాటిని పాటిస్తాం. వెబ్ అప్లికేషన్‌లో రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాం. బ్యాంకు ప్రాంగణాల్లో ఎలాంటి రాజకీయ సమావేశాలు నిర్వహించకుండా చర్యలు తీసుకున్నాం.

- శ్రీనివాసరావు, సీఈవో, ఎన్‌డీసీసీబీ

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రజాగళానికి అనూహ్య స్పందన

కావలిటౌన్/ వింజమూరు : కావలి, వింజమూరు పట్టణాల్లో శుక్రవారం సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో జరిగిన ప్రజాగళం కార్యక్రమానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. మధ్యాహ్నం 2.45 గంటలకే కావలికి చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ నేతలు బీద రవిచంద్ర, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య క్రిష్టారెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, బీజేపీ నేత వాకాటి నారాయణరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, రూప్‌కుమార్ యాదవ్, పోతుగంటి అలేఖ్య తదితరులు స్వాగతం పలికారు. చంద్రబాబు ముందుగా కావలికి రావడం, అప్పటికి మండుటెండలో ప్రజలు పెద్దగా కనిపించకపోవడంతో నేతలు టెన్షన్ పడి హడావుడి చేశారు. చివరకు భారీగా తరలిరావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సభ వద్దకు వచ్చే అభిమానుల వాహనాలను పోలీసులు అక్కడక్కడా ఆపడంతో టీడీపీ నేతలు వెళ్లి సర్ది చెప్పి వారి వాహనాలను లోపలకు అనుమతించారు.

● ఉదయగిరిని సస్యశ్యామలం చేస్తాం : చంద్రబాబు

వింజమూరులో శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రజాగళం సభ జనసముద్రంగా మారింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొని మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గాన్ని తాగు, సాగునీటితో సస్యశ్యామలం చేస్తానని, ప్రతి ఇంటికి శుద్ధినీరు అందజేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరా వడంతో పట్టణం కిక్కిరిసిపోయింది.

● టీడీపీలో చేరికలు


వింజమూరు మండలంలోని ఆరుగురు ఎమ్పీటీసీ సభ్యులు సుమలత, హైమావతి, ప్రసన్న, మౌనిక, భవానీ, పురుషోత్తం, వైసీపీ నాయకుడు వనిపెంట సుబ్బారెడ్డి, మరికొందరు కాకర్ల సురేష్ నాయకత్వంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబు కారును చుట్టిముట్టి కేరింతలు కొడుతున్న కార్యకర్తలు



కావలిలో చంద్రబాబును సత్కరిస్తున్న వేమిరెడ్డి, పక్కన కావ్య కృష్ణారెడ్డి



టీడీపీలో చేరుతున్న మాజీ ఎమ్పీటీసీ సభ్యురాలు



కలిగిరిలో చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు






జనసముద్రమైన వింజమూరు పట్టణం



టీడీపీ అభిమానుల ఆటోను అడ్డుకుంటున్న పోలీస్‌లకు సర్దిచెపుతున్న నేతలు



చంద్రబాబును కలిసిన ఇంటూరి

కందుకూరు, మార్చి 29: కందుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం కావలి నియోజకవర్గంకు వచ్చిన పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో పరిస్థితులను వివరించారు. ఆయన వెంట వెళ్లిన పార్టీ నాయకులు జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య తదితరులను చంద్రబాబుకు పరిచయం చేశారు.

అట్టహాసంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



కలువాయి: ఆవిర్భావ దినోత్సవ వేడుకలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు



ఉదయగిరి రూరల్: టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న చెంచలబాబు, నాయకులు

కందుకూరు,మార్చి 29: తెలుగుదేశం 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థాపించిన అనతికాలంలోనే ప్రజలకు చేరువైన పార్టీ టీడీపీ అన్నారు. దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, గోచిపాతల మోషే, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, వడ్డెళ్ల రవిచంద్ర ఉన్నారు.

కలువాయి: స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.



కందుకూరులో ఇంటూరికి కేక్ తినిపిస్తున్న నాయకులు



వింజమూరు: జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో మహాకూటమి విజయాన్ని ఆపే శక్తి ఎవరికీ లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ అన్నారు. స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమి 160 స్థానాలు సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక బొమ్మరాజు చెరువు సమీపంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ జెండాను ఉదయగిరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. దీంతో తెలుగు తమ్ముళ్లు ఆనందంతో తెలుగుదేశం జిందాబాద్, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్‌బాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

చంద్రబాబు సభలకు తరలిన కూటమి శ్రేణులు

కొండాపురం, మార్చి 29: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం సాయంత్రం వింజమూరు పట్టణంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభకు మండల నుంచి అధికసంఖ్యలో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు తరలివెళ్లారు.

జలదంకి : ప్రజాగళం పేరుతో వింజమూరులో జరిగిన టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు సభకు మండలం నుంచి టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పీ.మధురెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉదయగిరి రూరల్ : నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఎనిమిది మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో భారీసంఖ్యలో చంద్రబాబుకు సభకు వింజమూరు తరలివెళ్లారు. సభకు ముందుగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువుర్ని అలరించాయి.



కొండాపురం : వింజమూరుకు టీడీపీ శ్రేణులు



ఉదయగిరిరూరల్ : ప్రజాగళంకు వాహనాల్లో..

బిట్రగుంట : కావలిలో శుక్రవారం జరిగిన ప్రజాగళం సభకు మండలంలోని బోగోలు మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, మహిళా అధ్యక్షురాలు నూకసాని రాజ్యలక్ష్మి, జనసేన నాయకులు వెంకటేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం.. క్షమాగుణం

● భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కందుకూరు, మార్చి 29: గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జేడీబీఎం టౌన్ చర్చితో పాటు సంతోష్‌నగర్‌లోని విలియంకేరి టౌన్ చర్చి, ప్రశాంతి నగర్, శ్రీనగర్ కాలనీ, బృందావనం, ఉప్పుచెరువు, ప్రశాంతికాలనీ, ఆదిఆంధ్రకాలనీ తదితర ప్రాంతాలలోని చర్చిలలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అనేక గ్రామాలలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాస్టర్లు చర్చిలలో కేకులు కట్ చేసి దైవసందేశాన్ని వినిపించారు.

బిట్రగుంట : బోగోలులోని ది తెలుగు బాప్టిస్టు సంఘం, హోలీ ఫ్యామిలీ, తిప్పబొడన్‌పేట సెంటనరీతెలుగు బాప్టిస్ట్‌చర్చి, సిలోన్ పెంతుకోస్తు, హోరేబు ప్రార్థన మందిరం, తదితర క్రైస్తవ మందిరాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ దారా సుందర్‌రాజ్ క్రీస్తు జనన మరణం గూర్చి వివరించారు.

సీతారామపురం: సీతారామపురంలోని ఎస్సీ కాలనీలో ఫాదర్ ఎం.సునీల్, ఎస్.డేవిడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు పురవీధుల్లో ఉపవాస దీక్షలు చేపట్టి భక్తిశ్రద్ధలతో శిలువ మోస్తూ తమ భక్తిని చాటుకున్నారు. దేవుని పాటలు పాడుతూ ప్రార్థనలు చేస్తూ శిలువ యాగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంగం: మండలంలోని క్రిస్టియన్ సోదరులు చర్చిల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందులో భాగంగా సంగంలోని రక్షణ సువార్త, సులోమి నిర్వహించారు. కొరిమెర్ల, తరుణవాయి, దువ్వూరు, అన్నారెడ్డిపాళెం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రై డే గురించి ఆయా పాస్టర్లు క్రిస్టియన్ సోదరులకు వివరించారు. క్రిస్టియన్ సోదరులు పిల్లలు, పెద్దలతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు.



కందుకూరు : జేడీబీఎం టౌన్‌చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



బిట్రగుంట గుడ్‌ఫ్రైడే ఆరాధనలో సంఘస్తులు



ఉదయగిరిలో క్రీస్తు బోధనలను చేస్తున్న మత పెద్దలు

ఉదయగిరి: అయ్యవారిపల్లి, బోడబండ, కృష్ణంపల్లి, గుడినరవ, వెంగళరావునగర్, గండిపాళెం, ఉదయగిరిలోని చర్చీల్లో మతపెద్దలు గుడ్‌ఫ్రై డే విశిష్టతను వివరించారు. ప్రజల పాపాల కోసం ఏసుక్రీస్తు శిలువపై ప్రాణాలు అర్పించారని బోధించారు. పొరుగు వారిని ప్రేమిస్తూ వారి తప్పు లను క్షమించాలని క్రైస్తవ మత విశ్వాసం చెబుతోందన్నారు. ఉపవాసాలతో కూడిన ప్రార్థన నిర్వహించి గుడ్‌ఫ్రై డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఇంటూరి సౌజన్య ఇంటింటి ప్రచారం

కందుకూరు, మార్చి 29: కందుకూరు పట్టణంలోని 20వ వార్డు పోస్టాఫీసు సెంటర్, నందావారి వీధి, జనార్ధనస్వామి గుడి ప్రాంతాలలో టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య శుక్రవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లమూడి చెంచునారాయణ, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, వెంకటేశ్వర్లు, చీదెళ్ల పిచ్చయ్య, వేణుగోపాల్, వడ్లమూడి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

జగన్‌కు అంత తత్తరపాటు ఎందుకు?

జలదంకి, మార్చి 29: ఎన్డీఏ కూటమికి ఎంఆర్‌పీఎస్ మద్దతు ఇస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అంత తత్తరపాటు ఎందుకని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నేత గోచిపాతల వెంకటేశ్వర్లుమాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులో శనివారం ఎంఆర్‌పీఎస్ ఎన్నికల సమాయత్తంపై సమావేశం పెట్టుకుంటే ఈ సమావేశానికి పర్మిషన్ ఇవ్వకుండా పోలీసులతో సీఎం అడ్డుకోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ నిరంకుశ పాలనకు ఇది తార్కాణమని పేర్కొన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ ఆధ్వర్యంలో రాష్ట్రంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు.

ఆలయంలో కొబ్బరికాయలు కొట్టేందుకు ప్లాట్‌ఫాం ఏర్పాటు

కావలి రూరల్, మార్చి 29 : కావలి మండలం అన్నగారిపాలెం పంచాయతీలోని ముందరపొట్టెమ్మ ఆలయంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు ప్లాట్‌ఫాంను శుక్రవారం దాతలు ప్రారంభించారు. తుమ్మలపెంటకు చెందిన అళహరి చిట్టిబాబు, ఆయన భార్య పద్మప్రసన్నలు చిట్టిబాబు తల్లిదండ్రులు అళహరి నారాయణ, వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థం ఈ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అళహరి కిట్టు, మమత దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కొబ్బరికాయలు కొట్టే ప్లాట్‌ఫాం ప్రారంభిస్తున్న దాత

ఉలవపాళ్ల కాలనీల్లో ప్రచారం

దగదర్తి(బిట్రగుంట), మార్చి 29: దగదర్తి మండలం ఉలవపాళ్ల పంచాయతీలో కావలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయనున్న అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందిన జ్వాలారావుకు సన్మానం

ఉలవపాడు, మార్చి 29 : కడప జిల్లా పొద్దుటూరులో రాష్ట్రస్థాయిలో జరిగిన టగ్ ఆఫ్ వార్ క్రీడలో ప్రకాశం జిల్లాకు మొదటి స్థానం సాధించి, కప్పు రావడంలో కీలక పాత్ర పోషించిన ఉలవపాడు విద్యుత్ లైన్ మెన్ ఆర్‌వీ జ్వాలారావును అభినందించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందిన ఆయనను కందుకూరు ఈఈ ఏ వీరయ్య, ఏఈఈ పువ్వాడి శ్రీనివాసులు, సిబ్బంది పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.



జ్వాలారావును అభినందిస్తున్న ఈఈ వీరయ్య

మరమ్మతులకు నోచని జనరేటర్!

లింగసముద్రం, మార్చి 29 : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న జనరేటర్ చాలా ఏళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. పన్నెండేళ్ల క్రితం విద్యుత్ సరఫరా సక్రమంగా లేక కార్యాలయంలో కార్యకలాపాలకు ఆటంకం జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం జనరేట్ మంజూరు చేయాగా ఎంపీడీవో కార్యాలయానికి ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లు, కంప్యూటర్ పనులకు ఇబ్బంది లేకుండా ఉండేది. అయితే నాలుగేళ్ల క్రితం ఈ జనరేటర్ మరమ్మతులకు గురైంది. దీంతో ఎప్పటిలాగే ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి బాగు చేయించాల్సిన అవసరం ఉంది.

అర్హులైన కార్మికులనే ఆప్కాస్‌లో చేర్చాలి

కావలి, మార్చి 29: కావలి పురపాలక సంఘంలో ఎంతో కాలంగా డైలీవేజస్ కింద పనిచేస్తున్న కార్మికులలో అర్హులైన వారినే ఆప్కాస్‌లో చేర్చాలని, ఈ విషయంలో రాజకీయ ఒత్తిడిలకు అధికారులు తలొగ్గవద్దని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సీపీఐ నాయకులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపాల్టీలో 26 మందిని ఆప్కాస్‌లో చేర్చుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. అయితే కొన్ని సంవత్సరాలుగా డైలీ వేజస్ కింద సుమారు 90 మంది వరకు తక్కువ జీతంకు పని చేస్తున్నారన్నారు. వారిలో సీనియార్టీని బట్టి ఆప్కాస్‌లో చేర్చుకోవాలని, ఎమ్మెల్యే ఒత్తిడితో ఇతరులను చేర్చుకుంటే దానిపై పోరాటం చేస్తామన్నారు. డైలీవేజస్ కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, కొప్పర్తి నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, తన్నీరు వెంకటేష్,ఏసుపోగు ప్రభావతి, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా కష్టపడతాం

కందుకూరు, మార్చి 29: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎంఆర్పీఎస్ కార్యకర్తలంతా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా టీడీపీ కార్యకర్తలతో పోటీపడి పని చేస్తామని ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాస్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం కందుకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయడం ద్వారా వేలాదిమంది మాదిగలకు ఉద్యోగాలు వచ్చాయని, ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రానున్న రోజుల్లో తిరిగి ఎస్సీ వర్గీకరణ దేశవ్యాప్తంగా అమలు జరగాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీల కూటమికి మద్దతు ఇచ్చి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటులో ఎంఆర్పీఎస్ కార్యకర్తలు కీలకభూమిక పోషించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మంద కృష్ణపై కొందరు స్వార్థపరులు అర్థం లేని విమర్శలు చేయటం సిగ్గుచేటని, మాదిగ ప్రజలంతా ఆ స్వార్థపరులకు తగినబుద్ధి చెప్పటం ద్వారా జాతి అభ్యున్నతికి పాటుపడాలని కోరారు.

సీపీఐ నాయకుల పరామర్శ

కందుకూరు, మార్చి 29: మండలంలోని చినమోపాడు గ్రామం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు తల్లి బూసి లక్ష్మమ్మను ఆపార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు రావుల వెంకయ్య శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్న వెంకయ్య ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పోకూరి మాలకొండయ్య, షేక్ హుస్సేన్, వై.ఆనంద్‌మోహన్, గల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరూ అవినీతి పరులే..

కావలిటౌన్, మార్చి 29: కావలి నియోజకవర్గం నుంచి రెండు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేయనున్న అభ్యర్థులిద్దరూ అవినీతి పరులేనని పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం ట్రంకురోడ్డులో వ్యాపారస్తులతో కలిసి వచ్చే ఎన్నికల్లో ఇండిపెండింట్‌గా పోటీ చేయనున్న తనకు మద్దతివ్వాలని కోరుతూ మేనిఫెస్టో ప్రతులకు పంపిణీ చేశారు.

ముంగమూరులో వైసీపీ ప్రచారం

బిట్రగుంట, మార్చి 29: బోగోలు మండలంలోని ఏనుగులబావి, ముంగమూరు, కడనూతల, కోవూరుపల్లి, విశ్వనాథరావుపేట పంచాయతీలలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కోళ్లదిన్నెలోని అమ్మవారి ఆలయంలో పూజలు చేసి అనంతరం రోడ్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆనంను కలిసిన మేకపాటి మేనల్లుడు



ఆనంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సురేంద్రనాథ్‌రెడ్డి

మర్రిపాడు, మార్చి 29: బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం నెల్లూరులోని మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి తన మద్దతు తెలిపాడు. సురేంద్రనాథ్‌రెడ్డి మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డికి మేనల్లుడు. కుటుంబసభ్యులనే వారి వెంట నిలుపుకోలేక పోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మరో మేనల్లుడు రవీంద్రనాథ్‌రెడ్డి బీజేపీలో ఉండటంతో ఆయన నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి ఆనం గెలుపుకు కృషి చేస్తున్నారు.

ఆనంను సత్కరించిన టీడీపీ నేతలు

అనంతసాగరం, మార్చి 29: టీడీపీ సీనియర్ నాయకులు పాతపాటి మధుసూదన్‌రెడ్డి, చల్లా నర్సారెడ్డి, రాఘూరు జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని తన నివాసంలో కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు పార్టీలో చేరారు.

సీఏఏను తక్షణమే వెనక్కి తీసుకోవాలి

ఉదయగిరి రూరల్ మార్చి 29: కేంద్రం అమలు చేస్తున్న పౌరసత్వ సవరణ చట్టంను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు తప్పవని సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని సీఏఏకు వ్యతిరేకంగా ప్రత్యేక సంచికలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, దేశ సమైక్యతకు ప్రమాదకరమన్నారు. ఈ చట్టంతో దేశంలో ఉద్రిక్తలు ఏర్పడడంతో పాటు అశాంతి నెలకొంటుందని విమర్శించారు. ప్రాథమిక దశలోనే సీఏఏను తిప్పకొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఫరుద్దీన్‌బాషా, నాయబ్, వెంకటేశ్వర్లు, కాకు కృష్ణ, హరి పాల్గొన్నారు.



ప్రత్యేక సంచికలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాగునీటి సరఫరా కోసం పనులు

అనంతసాగరం, మార్చి 29: ఆత్మకూరు మున్సిపాలిటీకి సోమశిల నుంచి సరఫరా చేసే తాగునీరు సక్రమంగా అందకపోవడంతో శనివారం ప్రాజెక్టు సమీపంలోని ఉత్తర కాలువ వద్ద నీటి వృథాను అరికట్టేలా పనులు చేశారు. తాగునీటి పథకానికి నీరు సరఫరా జరిగేలా ఇసుక బస్తాలు వేసి నీటిమట్టం పెరిగేలా చర్యలు చేపట్టారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

నేడు ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉదయగిరి రూరల్: పట్టణంలోని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో శనివారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ నిర్వహించనున్నట్లు ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు తెలిపారు. శిక్షణకు పీవో, ఏపీవోలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

విద్యుత్ వినియోగంపై విద్యార్థుల ర్యాలీ

అనంతసాగరం, మార్చి 29: సోమశిల గురుకుల పాఠశాల విద్యార్థులు శుక్రవారం విద్యుత్ వినియోగం, ఆదాపై ప్రతేక ర్యాలీ నిర్వహించారు. ఎండ తీవ్రత అధికమవుతున్న క్రమంలో విద్యుత్ వినియోగం పెరిగి భవిషత్తులో ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

కోవూరు, మార్చి 29: తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, నాయకులు తిరుమూరు అశోక్‌రెడ్డి, నాటకరాని వెంకట్, సుబ్బానాయు డు, తదితరులు పాల్గొన్నారు.


కోవూరులో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

విడవలూరు: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండా ఎగురవేసి స్వీట్లు పంచుకున్నారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాతూరు శ్రీనివాసులురెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, చె ముకుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నివాసంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జెండాను ఎగరవేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు మాట్లాడుతూ కోవూరు టీడీపీ శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, ఇరువూరి శీధర్‌రెడ్డి, బి రాధయ్య పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ కన్వీనర్ వీరేంద్రచౌదరి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని, పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు, ఉదయ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో కెరీర్ అవకాశాలు అధికం


వేడుకలను ప్రారంభిస్తున్న మేనేజర్ సుధాకర్‌నాయుడు

ముత్తుకూరు, మార్చి 29: ఫార్మసీ రంగంలో కెరీర్ అవకాశాలు అధికమని రత్నం ఫార్మసీ కళాశాల మేనేజర్ సుధాకర్‌నాయుడు తెలిపారు. పిడతాపోలూరులోని రత్నం ఫార్మసీ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న ఫార్మసీ రంగంలో ఉద్యోగాలకు కొదువ లేదన్నారు. రత్నం ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు బోధనతోపాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్లేస్‌మెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డీ ఫార్మసీ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. 2024 సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్లేస్‌మెంట్ సెలక్షన్‌లో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రపూర్ణచంద్ర, డైరెక్టర్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే వేడుకల్లో వేమిరెడ్డి దంపతులు

బుచ్చిరెడ్డిపాలెం, మార్చి 29: అంబేడ్కర్ నగర్‌లో ఉన్న బేతేలు చర్చిలో జరిగిన గుడ్‌ఫ్రైడే వేడుకల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. క్రిస్టియన్ సెల్ నాయకుడు ఊసురుపాటి ప్రసాద్‌తో కలిసి ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ గెలిచి చంద్రబాబు సీఎంగా, నెల్లూరు ఎంపీ, కోవూరు ఎమ్మెల్యేగా తమకు విజయం చేకూరాలని ప్రార్థించారు. వేమిరెడ్డి దంపతులతో టీడీపీ నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, హరినాథ్ తదితరులున్నారు. దళిత నేత, వైసీపీ నాయకుడు సోదల రమణయ్య వేమిరెడ్డి దంప తుల సమక్షంలో టీడీపీలో చేరగా టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ప్రార్థన చేస్తున్న వేమిరెడ్డి దంపతులు

వేమిరెడ్డి కుమారుడు, కుమార్తె ప్రచారం

నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలను గెలిపించాలని కోరుతూ శుక్రవారం వారి కుమారుడు, కుమార్తె నీలిమారెడ్డి, అర్జున్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని 7, 13 వార్డులలో ఇన్‌చార్జ్‌లు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, షబ్బీర్‌బాషా, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డి విజయానికి కృషి

తోటపల్లిగూడూరు, మార్చి 29: మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని వేదాయపాలెంలోని ఆయన నివాసంలో టీపీగూడూరు టీడీపీ నాయకులు శుక్రవారం కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు. సోమిరెడ్డి విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, కోడూరు శ్రీనివాసరెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కొణతం రఘుబాబు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సోమిరెడ్డిని కలిసిన టీపీగూడూరు నేతలు

ఆశాజనకంగా వరి ధాన్యం ధర


వరి ధాన్యం పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కోవూరు, మార్చి 29: వరి ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నాయని వ్యవసాయ సహాయ సంచాలకులు సుజాత అన్నారు. స్థానిక నందలగుంట సమీపంలోని పొలాల్లో వరి ధాన్యం అమ్మకాలను శుక్రవారం ఆమె వ్యవసాయాధికారిణి ఇందిరావతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టి బీపీటీ 5204 రకం ధాన్యం ధర రూ. 23వేలు, కేఎస్‌ఎం 1638 రకం ధాన్యం ధర రూ. 22వేలు పలుకుతోందన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ధాన్యం ఎండకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిలువ ఉంచుకోవాలనుకున్న ధాన్యాన్ని భద్రపరచుకుని మిగతా ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ చైతన్య, రైతు నాయకులు వవ్వేటి మల్లికార్జునరెడ్డి, నక్కల మురళి, మాదిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామ గెలుపు కోసం కోడలి ప్రచారం

మనుబోలు, మార్చి 29: ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి తన మామ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి కోరారు. శుక్రవారం మనుబోలు, కేఆర్ పురం, చంద్రమౌళీ నగర్, ప్రధాన రహదారి కూడళ్లలో ఇళ్ళకు, దుకాణాలకు వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. అంతకు ముందు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు పి వెంకటకృష్ణారెడ్డి, జనసైనికులు పవన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.


మనుబోలులో ప్రచారం నిర్వహిస్తున్న సోమిరెడ్డి శృతిరెడ్డి, టీడీపీ శ్రేణులు


చెన్నకేశవస్వామి దేవస్థానంలో పూజలు

వెంకటాచలం: గొలగమూడిలోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో సోమిరెడ్డి శృతిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట తెలుగు మహిళా జిల్లా కార్య నిర్వహక కార్యదర్శి హేమలత, మండలాధ్యక్షురాలు దువ్వూరు లక్ష్మమ్మ తదితరులున్నారు.

మంత్రి కాకాణికి గుణపాఠం చెప్పాలి

ముత్తుకూరు: కక్ష సాధింపు రాజకీయాలతో సర్వేపల్లి నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించిన మంత్రి కాకాణికి గుణపాఠం చెప్పాలని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముత్తుకూరు బీసీ, ఎస్టీ కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేపల్లి ప్రజల భవిష్యత్తును కాపాడుకునేందుకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు ఈపూరు మునిరెడ్డి, బీజేపీ నాయకులు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమే : బీజేపీ


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సుబ్రహ్మణ్యంరెడ్డి

వెంకటాచలం, మార్చి 29: ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సుబ్రహ్మణ్యంరెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన బొమ్మలు వేసుకొని తమ పథకాలే అంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో వైసీపీ అవినీతి తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి తరఫున తిరుపతి ఎంపీగా వెలగపూడి వరప్రసాద్, సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుపించుకోవడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్ నాయుడు, కోకన్వీనర్ ఆరుముళ్ల మురళీ, ఓబీసీ మండలాధ్యక్షుడు అనసాపురం శ్రీనివాసులు, యువమోర్చ మండలాధ్యక్షుడు గోత్తల నరేష్ తదితరులున్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరికలు

సైదాపురం: సైదాపురం పంచాయతీ పరిధిలోని దాడిశెట్టిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు అన్నంగి వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సామాజిక వర్గంతో పాటు దళితవాడకు చెందిన 50 కుటుంబాలు శుక్రవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ సమక్షంలో టీడీపీ చేరారు. వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం పెరుమాళ్ళపాడులో నిర్వహించిన శంఖారావం కార్యక్రమంలో పాల్గొని ఎన్నికల మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను మహిళలకు అందజేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి అసెంబ్లీకి పంపాలని కోరారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్‌బోర్డు మాజీ చైర్మన్ తానంకీ నానాజీ, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వెంకటగిరి అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

వెంకటాచలం, మార్చి 29 : మండలంలోని పూడిపర్తి, ఎగువమిట్ట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ డక్కిలి శ్రావణి, నాయకులు కోదండరామిరెడ్డి, రఘునందన్‌రెడ్డి, వెంకటశేషయ్య, రమణయ్య, సుదీర్ తదితరులున్నారు.

సోమిరెడ్డి గెలుపే ధ్యేయం : ఎమ్మార్పీఎస్

పొదలకూరు, మార్చి 29 : సర్వేపల్లి ఎన్డీఏ కూటమి ఎమ్మె ల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి గెలుపే మాదిగల గెలుపు అని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ సూరిపాక వాసుదేవ రావు మాదిగ అన్నారు. శుక్ర వారం సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఎంఎస్పీ సీనియర్ నాయకులు తాటిపర్తి మస్తానయ్య మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సూరిపాక వాసుదేవరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్ కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ సీనియర్ నాయకులు, కొంగి వెంకట రమణయ్య, కొంగి మస్తానమ్మ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎస్ మోహన్, వెంకటేశ్వర్లు, పునీత్, పెంచలయ్య, ఎస్.పెంచలయ్య, కిషోర్, పెంచలప్రసాద్, మహేష్, చిడతల శ్రీను, పెంచలయ్య, మస్తాన్, యానదయ్య, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడలో శ్రీవిద్య ఉపాసన

బుచ్చిరెడ్డిపాలెం, మార్చి 29: మండలంలోని జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం శ్రీమహా మేరు మండలి ట్రస్ట్, చెన్నై ఆధ్వర్యంలో శ్రీవిద్య ఉపాసన కార్యక్రమం జరిగింది. ఉదయం శ్రీలలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమం జరిగింది. ఆలయ ఈవో వి.గిరికృష్ణ పర్యవేక్షించారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

సంగీత పండుగ

- నేటి నుంచి త్యాగరాజ స్మరణోత్సవాలు
- 5వ తేదీ వరకు కచేరీలు


స్మరణోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 29 : ప్రతిష్ఠాత్మకంగా, సంప్రదాయబద్ధంగా ప్రతి సంవత్సరం జరిగే త్యాగరాజ స్మరణోత్సవాలు శనివారం నుంచి ప్రారంభంకానున్నాయి. సంగీత ప్రియులకు శ్రవణానందం కలిగించే ఈ సంగీత పండుగ ఏప్రిల్ 5వ తేదీ వరకు జరుగుతుందని భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి డాక్టర్ యనమండ్ర నాగదేవి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం టౌనుహాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉత్సవ సభ ఉపాధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్‌వీ మల్లికార్జున్‌రావు, డాక్టర్ ఎస్ సాయి ప్రసాద్, పామర్తి బలరామ్‌తో కలిసి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగరాజస్వామి భక్తులైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, డాక్టర్ యనమండ్ర వెంకటేశ్వరశాస్త్రి భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజస్వామి స్మరణోత్సవాలను ఐదు దశాబ్దాల క్రితం ప్రారంభించారని చెప్పారు. నాటి నుంచి ఏటా స్మరణోత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది శనివారం నుంచి ఉత్సవాలు జరుగుతాయని, ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు హరికథా గానం, 4గంటల నుంచి నాదస్వర కచేరి, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు స్థానిక సంగీత విద్వాంసులతో పంచరత్న ఘోష్టిగానం, 6.30 నుంచి 7 గంటల వరకు వీణ కచ్చేరి జరుగుతాయని తెలిపారు. తొలిరోజు రాత్రి 7.15గంటలకు శ్రీభవ్య హరి అండ్ పార్టీ గాత్ర కచేరీ జరుగుతుందని చెప్పారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు ప్రతిరోజూ రాత్రి ప్రముఖ సంగీత విద్వాంసుల కచేరీలు జరుగుతాయన్నారు. 6వతేదీ ఉదయం సీతారామ కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి 7గంటలకు ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు ఎస్ మాధవరావు, యద్దనపూడి ధనుంజయ, టీ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎస్ శ్రీనివాస కుమార్ పాయ్, దర్శ జనార్దన్, కేడీ కృష్ణకుమార్, వంక శ్రీహరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దోమల్లేని నెల్లూరే లక్ష్యం

- సిటీ అభ్యర్థి నారాయణ సతీమణి రమాదేవి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 29 : నెల్లూరును దోమల్లేని నగరంగా తీర్చిదిద్దటమే లక్ష్యమని, అదే నారాయణ ప్రధాన అజెండా అని టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి అన్నారు. నగరంలోని 15, 42 డివిజన్లలో గల ఖుద్దూస్ నగర్ ఆర్చ్, నందనం పార్క్, పుట్టవీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవి ష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న రమాదేవి ప్రతి ఇంటికి వెళ్లి గతంలో మంత్రిగా నారాయణ చేసిన అభివృద్ధిని వివరించారు. రాబోవు ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు.


ఇంటింటి ప్రచారంలో పొంగూరు రమాదేవి


సోమిరెడ్డిని సత్కరిస్తున్న కోటంరెడ్డి బ్రదర్స్

కోటంరెడ్డి సోదరులతో సోమిరెడ్డి భేటీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 29 : సర్వేపల్లి నియోజకవర్గంలో తనకు పూర్తి సహకారం అందించాలని రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి సోదరులను మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం కోటంరెడ్డి కార్యాలయానికి సోమిరెడ్డి విచ్చే శారు. శ్రీధర్ రెడ్డి, గిరిధర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అనంతరం సోమిరెడ్డిని కోటంరెడ్డి సోదరులు సత్కరించారు. నెల్లూరు రూరల్‌లో కోటంరెడ్డికి పూర్తి సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని స్థానాల్లో టీడీపీ విజయం సాధించే దిశగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని చెప్పారు.

ప్రజా సేవ కోసమే నారాయణ పోటీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి పొంగూరు నారాయణకు ప్రజాసేవ తప్ప మరో ఆలోచన లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నారాయణకు మద్దతుగా నగరంలోని 14వ డివిజన్‌లో కోటంరెడ్డి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనిల్ రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉండి నగర నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని, మంత్రిగా రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి నారా యణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తారని, ఆయనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, డివిజన్ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు పసుపులేటి మల్లికార్జున, ఎస్‌కే సుభాన్‌బాషా, నాయకులు ఎల్లమందరెడ్డి, శేషయ్య నాయుడు, జలదంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో శ్రీనివాసులురెడ్డి

జూలై నుంచి రూ.4వేల పింఛన్

- కేతంరెడ్డి వినోద్‌రెడ్డి


ప్రచారంలో వినోద్‌రెడ్డి

నెల్లూరు(క్రైం), మార్చి 29: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం గెలుపొందడం ఖాయమని, నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ఏడాది జూలై 1 నుంచి రూ.4వేల పింఛను అమలు చేస్తారని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 5వ డివిజన్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధి వైసీపీ ప్రభుత్వ పతనంతోనే మొదలవుతుందన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పాలి : కిషోర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 29: యువత ఉద్యోగ అవకాశాలను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వా నికి ప్రజలు బుద్ధి చెప్పాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పిలుపునిచ్చారు. నగరంలోని సుబేదారుపేటలో గల జనసేన కార్యాలయంలో శుక్రవారం పలువురు యువత కిషోర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయలేదని, రాష్ట్రానికి పరిశ్రమలు రాకపోవడంతో ప్రైవేటు ఉద్యోగాలు అందక యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలసపోతోందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మహేష్, లక్ష్మయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


జనసేన పార్టీలో చేరిన యువతతో కిషోర్

విశ్వబ్రాహ్మణ సేవా సంఘం వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 29 : నగరంలోని విరాట్‌నగర్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం 28వ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. సంఘం శాశ్వత అధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, పంచవృత్తుల పతాకం ఎగురవేసి వందనం చేశారు. అనంతరం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో అలిమెలి సుబ్రహ్మణ్యం ఆచారి, ఇందుకూరు రమేష్ ఆచారి, దండపాణి సురేష్ ఆచారి, అలిమెలి శ్రీహరి ఆచారి తదితరులు పాల్గొన్నారు.


పంచవృత్తుల పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

- రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 29 : తెలుగుదేశం పార్టీలో చేరినవారందరూ కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలోని 31, 37 డివిజన్లకు చెందిన మాసారపు రాజు, లెక్కల పుల్లారెడ్డి, పొగడ్తల శీనయ్య, చాంద్‌బాషా, సాయి, హయత్‌బాషా వారి బృందం శుక్రవారం రూరల్ టీడీపీ కార్యాలయంలో కోటంరెడ్డి సోదరుల సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నేపల్లి రఘు, కృష్ణ, కూకటి హరిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ములుముడిలో కోటంరెడ్డి కుటుంబం ప్రచారం

నెల్లూరు రూరల్ : మండలంలోని ములుముడిలో రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఆయన సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి, టీడీపీ నేత తాళ్లపాక తారకారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరారు.


సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న శ్రీధర్‌రెడ్డి కుమార్తె

ప్రజలకు అండగా పసుపు జెండా : ధర్మవరం

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 29 : అన్ని వర్గాల ప్రజలకు అండగా పసుపు జెండా ఉంటుందని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. నగరంలో గుప్తాపార్కు సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రమంతా పసుపుమయమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ధర్మవరం గణేష్ కుమార్, చెంగయ్య, భాస్కర్, రాజ, సిద్ధ కళాచారి, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), మార్చి 29: నగరంలోని రామ్మూర్తి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని నగర ఈఈ సోమశేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలాజీనగర్, ఆదిత్యానగర్, పుట్టవీధిలో సరఫరా నిలిపివేస్తునామన్నారు. వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గ్రామ ప్రయోజనాలకు అరాచక శక్తుల అడ్డు

- పొట్టేపాళెంలో టీడీపీ, సీపీఎం ధ్వజం

నెల్లూరు రూరల్, మార్చి 29 : నెల్లూరు రూరల్లోని పొట్టేపాళెం గ్రామ ప్రయోజనాలకు వైసీపీలోని కొన్ని అరాచకశక్తులు అడ్డుపడుతున్నాయని టీడీపీ, సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం గ్రామంలో మీడియా సమావేశం నిర్వహించారు. నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఆలూరు తిరుపాలు, సర్పంచ్ ఏడుకొండలు, ఎంపీటీసీ నారాయణ మాట్లాడారు. గ్రామ పంచాయతీకి చెందిన స్థలంలో ఊరు ఉమ్మడిగా కల్యాణ మండపం నిర్మించేందుకు ట్రస్టును ఏర్పాటు చేసుకుని పనులు మొదలుపెట్టామన్నారు. ఈ క్రమంలో వైసీపీ నాయకులైన శ్రీకాంత్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, కోటేశ్వరరావు ఉద్దేశపూర్వకంగా అదే స్థలంలో సచివాలయం, ఆర్బీకే భవనాలు నిర్మించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కల్యాణ మండప నిర్మాణానికి గ్రామస్తులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, రఘునాథరెడ్డి, జితేంద్రబాబు పాల్గొన్నారు.

రేపు గ్లకోమా కంటి పరీక్షలు

నెల్లూరు (సాంస్కృతికం): ఆపోవా ఆధ్వర్యంలో స్టోన్‌హౌస్‌పేటలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి గ్లకోమా కంటి పరీక్షలు నిర్వహిస్తారని ఆపోవా అధ్యక్షుడు ఏసీఎస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. మోడ్రన్ కంటి వైద్యశాల సహకారంతో జరుగుతున్న ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.


చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 29 : గుడ్ ఫ్రైడే సందర్భంగా నగరంలోని పలు చర్చిలలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చింతారెడ్డిపాళెం ఆర్‌సీఎం చర్చిలో జరిగిన వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. శిలువ మోసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

- కపాడిపాలెం ఆర్‌సీఎం చర్చి శిలువ మార్గంలో జనసేన ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పాల్గొని శిలువ మోశారు.

మద్యం సీసాలు స్వాధీనం

నెల్లూరు(క్రైం), మార్చి 29: మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 12 క్వార్టర్ సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం ఎన్‌టీఆర్ నగర్, ఎస్వీజీఎస్ కళాశాల మైదానం తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. రాయపుపాళేనికి చెందిన ఎం రవితేజ 12 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండటంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ తెలిపారు.





కొత్త రూపు ఇలా ఉంటుంది

తిరుపతి రైల్వేస్టేషన్‌కు

వరల్డ్‌క్లాస్ హంగామా

తిరుపతి రైల్వేస్టేషను రూపురేఖలు మారుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా, కళ్లు చెదిరేలా కొత్త స్టేషన్ పనులను పట్టాలెక్కించేందుకు అధికార వర్గాలు శ్రమిస్తున్నాయి. ప్లాట్‌ఫారాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు కొత్త రూపుదిద్దుకుంటున్నాయి. అనునిత్యం అసంఖ్యాకంగా తిరుమలకు వచ్చే భక్తులకు అన్ని వసతులతో కూడిన స్టేషన్ నిర్మించేందుకు కేంద్రం గతేడాది జూన్ 13న రూ.300 కోట్లతో శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయి. అన్ని ఆధునిక హంగులూ సమకూర్చి వచ్చే ఏడాది లోపు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

- తిరుపతి సెంట్రల్



రైల్వేస్టేషన్ దక్షిణం వైపు మూడంతస్తుల భవన నిర్మాణం

తిరుపతికి పెరగనున్న రైళ్లు

తిరుపతి పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఉత్తర భారతదేశంలో ఉన్న పలు పుణ్యక్షేత్రాలను కలుపుతూ మరికొన్ని నూతన ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనుందని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు.



దక్షిణం వైపు.. : ● ఈ భవనం అండర్ గ్రౌండ్‌లో 200 కార్లు, జీపులు, 300 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసుకొనే వసతులు ఉంటాయి. ● మొదటి అంతస్తులో టికెట్ బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికుల రాకపోకలకు వసతులు, ట్రాఫిక్ నిర్వహణ, ఏఎస్ఎం కార్యాలయాలు, ప్రయాణికుల విశ్రాంత హాళ్లు ఉంటాయి. ● రెండో అంతస్తులో ప్రయాణికులకు అవసరమైన ఆహార పదార్థాల దుకాణాలు, విశ్రాంత గదులు ఉంటాయి. ● మూడో అంతస్తులో విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగుల కోసం రెస్ట్ రూములు, ఇతర రైల్వే అధికారుల కార్యాలయాలు ఉంటాయి. ● ఈ భవనంలో ప్రయాణికులు కింది నుంచి పైకి వెళ్లడానికి 8 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు ఉంటాయి.

ఉత్తరం వైపు.. : ● ఈ భవనాన్ని 10,800 చదరపు మీటర్లతో మూడు అంతస్తులుగా నిర్మిస్తారు. ● గ్రౌండ్ ఫ్లోర్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్లు, రాకపోకలు నిర్వహించే ప్రయాణికులకు సేవలు, రైల్వే ఆపరేటింగ్ ఉద్యోగుల కార్యాలయాలు, ఎస్ఎంఆర్, ఏఎస్ఎంల కార్యాలయాలు ఉంటాయి. ● మొదటి అంతస్తులో కామన్ వెయిటింగ్ హాల్స్, వీఐపీ లాంజ్‌లు, క్లాక్ రూమ్‌లు ఉంటాయి. ● రెండో అంతస్తులో విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టులు, పలురకాల దుకాణాలు ఉంటాయి. ● మూడో అంతస్తులో ముందస్తు టికెట్ రిజర్వేషన్ కౌంటర్లు, పలు రైల్వే విభాగాల కార్యాలయాలు, రిటైరింగ్ రూమ్‌లు ఉంటాయి. ● ఈ భవనంలో 6 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు ఉంటాయి. అండర్ గ్రౌండ్ ఉండదు.

ఈ రెండు భవనాలకు ప్లాట్‌ఫారాలతో అనుసంధానం చేస్తూ 35 మీటర్ల వెడల్పుతో రెండు వైపుల పాదచారులకు రహదారి వసతులు (ఎయిర్ కాన్ కోర్సులు) కల్పించనున్నారు.

ఇలా అయితే రద్దీ భారం తగ్గుతుంది

రైళ్ల రద్దీతో స్టేషన్ లోపలకు చేరుకోవడానికి కొంత ఆలస్యం అవుతోంది. కిలోమీటరు దూరంలో ఉన్న వెస్ట్ రైల్వే స్టేషన్‌ను ప్యాసింజర్ టెర్మినల్‌గా వినియోగించుకోవచ్చు. రేణిగుంట రైల్వే జంక్షన్ వరకు కొన్ని ఎక్స్‌ప్రెస్‌లను ఆపి మరో టెర్మినల్‌గా వినియోగించుకోవచ్చు. తిరుచానూరు రైల్వేస్టేషన్‌లోనే కొన్ని రైళ్లను నిలపవచ్చు. ఇందువల్ల నగరం కూడా విస్తరిస్తుంది.



తిరుపతి రైల్వే స్టేషన్ పాతభవన ముఖ ద్వారం

వేగంగా జరుగుతున్న పనులు

బహుళ అంతస్తుల నిర్మాణం, కార్పొరేట్ సౌకర్యాలతో మారనున్న రూపురేఖలు





ఉత్తర, దక్షిణప్లాట్‌ఫారాలను కలిపే ర్యాంపుల నిర్మాణాలు

50 ఏళ్ల విజన్‌తో నిర్మాణం

130 ఏళ్ల క్రితం మీటర్ గేజ్ రైలు మార్గంలో రెండు మూడు రైళ్లతో తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. కాలక్రమేణా ఈ మార్గం బ్రాడ్‌గేజ్‌గా మారింది. నేడు దేశం నలుమూలల నుంచి 130కి పైగా రైళ్లు తిరుపతి మీదుగా రాకపోకలు సాగిస్తూ రోజుకు 80వేల మంది వరకు ప్రయాణిస్తుంటారు. ఇందుకు అనుగుణంగా కొత్త స్టేషన్ రూపుదిద్దుకుంటోంది. స్టేషన్‌కు దక్షిణం వైపు 14,600 చదరపు మీటర్లతో అండర్ గ్రౌండ్ తోపాటు మూడంతస్తులు నిర్మిస్తున్నారు. ఉత్తరం వైపు 10,800 చదరపు మీటర్లతో మూడంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. 50 ఏళ్ల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నిర్మాణాలు చేపడుతున్నారు.

ప్రచార సామగ్రి మాటున

కలెక్టర్ ఉత్తర్వుల పేరిట

వైసీపీ ప్రచార సామగ్రి తరలింపు

టీడీపీ నేతలకు, మీడియాకు నో ఎంట్రీ

వివరాలు సైతం వెల్లడించని వైనం

తాయిలాలూ తరలించేశారా?

రేణిగుంట, మార్చి 29: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల పేరిట రేణిగుంట గోదాముల నుంచీ వైసీపీ ప్రచార సామగ్రి మొత్తం తరలించేశారు. ఆ ప్రక్రియను పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ నేతలను, మీడియా ప్రతినిధులను గోదాముల్లోకి అనుమతించలేదు. వీడియోలు, ఫొటోలు కూడా తీయనివ్వలేదు. కనీసం వివరాలైనా వెల్లడించమని కోరినా నోరు మెదపలేదు. రేణిగుంట శివార్లలోని ప్రైవేటు గోదాముల్లో నిల్వ వుంచిన వైసీపీ ప్రచారసామగ్రిని మరో చోటకు తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో అప్రమత్తమైన శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అక్కింతల కృష్ణ యాదవ్ నేతృత్వంలో పలువురు నాయకులను రేణిగుంట గోదాముల వద్దకు పంపించారు. వారు వెళ్లేటప్పటికి రేణిగుంట, ఏర్పేడు తహసిల్దార్లు, రెవిన్యూ సిబ్బంది, పోలీసు బందోబస్తు నడుమ గోదాముల నుంచీ లారీల్లో వైసీపీ ప్రచార సామగ్రిని తరలిస్తున్నారు. సీజ్ చేసిన సామగ్రిని ఎందుకు, ఎక్కడికి తరలిస్తున్నారని టీడీపీ నేతలు ప్రశ్నించగా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సామగ్రిని విడుదల చేస్తున్నామని, ఏదైనా వివరాలు కావాలంటే రిటర్నింగ్ అధికారిని అడగండంటూ రేణిగుంట తహసిల్దారు నాగేశ్వరరావు సమాధానమిచ్చారు. గోదాముల లోపలికి వెళ్లి వీడియోలు, ఫొటోలు తీసేందుకు యత్నించగా అధికారులు వారిని లోనికి అనుమతించలేదు. ఈ విషయమై టీడీపీ నేతలు ఇచ్చిన సమాచారంతో మీడియా ప్రతినిధులు గోదాముల వద్దకు చేరుకోగా వారిని కూడా అధికారులు గోదాముల లోపలికి రానివ్వలేదు. శుక్రవారం ఉదయం నుంచీ రాత్రి వరకూ లారీల్లో వైసీపీ ప్రచార సామగ్రి గోదాముల నుంచీ బయటి ప్రాంతానికి తరలిపోతూనే వున్నాయి.ఓటర్లను ప్రభావితం చేయగలిగిన తాయిలాలను మాత్రం మూడు గోదాముల నుంచీ వేరుచేసి ఒక గోదాములో వుంచి సీజ్ చేశారు.



పోలీసు పహారా నడుమ గోదాములో ఉన్న వైసీపీ సామగ్రి తరలింపు

అధికారుల తీరుతో బలపడుతున్న అనుమానాలు

గోదాముల నుంచీ వైసీపీ ప్రచార సామగ్రిని విడుదల చేసిన క్రమంలో అధికారుల తీరు పలు అనుమానాలకు అవకాశమిస్తోంది. ఎన్నికల ప్రక్రియ వివిధ రాజకీయ పక్షాలతో కూడుకున్నది. అందుకే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మొదలుకుని జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దాకా ఎన్నికల సమయంలో తరచూ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు పెడుతుంటారు. నాయకులకు సమగ్ర సమాచారం ఇవ్వడం, వారి అనుమానాలను నివృత్తి చేయడం, ఫిర్యాదులను పరిష్కరించడం, తాము తీసుకున్న చర్యలను వివరించడం చేస్తుంటారు. ఈ పారదర్శకత అన్నది లేకపోతే ఎన్నికల ప్రక్రియకు అర్థమే లేదు. అయితే జిల్లాలో దీనికి విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. వైసీపీ ప్రచార సామగ్రికి బిల్లులు వుంటే, ఎంత పరిమాణానికి వున్నాయి? అవి సరైనవేనా లేక నకిలీవా? అన్నది ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలకు అధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరముంది. అయితే ఆ ప్రయత్నం అధికారులు చేయలేదు. మీడియా ద్వారా ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యతనూ విస్మరించారు. వీటన్నింటికీ మించి గోదాముల్లో ఓటర్లకు పంపిణీ చేసే ఉద్దేశంతో నిల్వ వుంచిన తాయిలాల వాస్తవ పరిమాణం బయటికి తెలిసే అవకాశం లేకుండా పోయింది. రూ. 1.22 కోట్ల విలువైన తాయిలాలను గుర్తించి సీజ్ చేశామని అధికారులు చెబుతున్నప్పటికీ దాన్ని ప్రతిపక్ష పార్టీలు గానీ ప్రజలు గానీ నమ్మడం లేదు. తాయిలాలు భారీగానే వుంటాయని, అధికారులు నామమాత్రంగా నమోదు చేశారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వైసీపీ ప్రచార సామగ్రి మాటున తాయిలాలను కూడా బయటికి తరలించేశారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. మరోవైపున ఇందులో సహకరించిన కొందరు అధికారులకు భారీగా ముడుపులు ముట్టాయన్న ఆరోపణలూ వున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా వెళుతున్నాయి. గురువారం రాష్ట్రస్థాయి ప్రతిపక్ష పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఏకంగా జిల్లా కలెక్టర్‌పైనే ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఫిర్యాదులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ప్రతిపక్షాలతోపాటు ప్రజల నమ్మకాన్ని కూడా కోల్పోతున్నారు. అయినా అధికారుల తీరులో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రచార సామగ్రి, తాయిలాల విషయంలో మండల స్థాయి నుంచీ జిల్లా అధికారుల వరకూ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న అభిప్రాయం రాజకీయ, అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది. కాగా ఈ విషయమై వివరణ కోరేందుకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారైన ఆర్డీవో రవిశంకర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదు.

నాయుడుపేట, శ్రీకాళహస్తిల్లో

నేడు ప్రజాగళం సభలు



తిరుపతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం పేరిట ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయుడుపేట, శ్రీకాళహస్తిల్లో జరిగే బహిరంగసభల్లో పాల్గొననున్నారు.శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు నుంచీ హెలికాప్టర్‌లో బయల్దేరి 2.50 గంటలకు నాయుడుపేట చేరుకుంటారు. 3 గంటల నుంచీ 4.30 గంటల వరకూ అక్కడి బస్టాండు కూడలిలో జరిగే సభలో పాల్గొని ప్రసంగిస్తారు. సాయంత్రం 5.25 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకాళహస్తి చేరుకుంటారు.5.30 నుంచీ రాత్రి 7 గంటల వరకూ బేరివారి మండపం కూడలిలో నిర్వహించే సభలో పాల్గొంటారు.రాత్రికి శ్రీకాళహస్తిలోనే బస చేస్తారు.ఆదివారం ఉదయం కర్నూలు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పర్యటనకు వెళ్లనున్నారు. కాగా చంద్రబాబు రాకను పురస్కరించుకుని సూళ్ళూరుపేట టీడీపీ ఇంఛార్జి నెలవల సుబ్రమణ్యం, అభ్యర్థి నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ తదితరులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే శ్రీకాళహస్తి సభను విజయవంతం చేయడానికి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి పెద్ద ఎత్తున జనసమీకరణకు యత్నిస్తున్నారు. టీడీపీతో పొత్తులో వున్న బీజేపీ, జనసేన పార్టీల నేతలను, శ్రేణులను కూడా సభలో పాల్గొనాల్సిందిగా ఆయన స్వయంగా కలసి ఆహ్వానించారు. చంద్రబాబు పాల్గొనే బహిరంగసభలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రెండు నియోజకవర్గాల్లోనూ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనండి

● వలంటీర్లపై ఎమ్మెల్వో ఒత్తిడి

వరదయ్యపాళెం, మార్చి 29 : రాజీనామా చేసి వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనండి...పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చాక మిమ్మల్నే విధుల్లోకి తీసుకుంటాం అంటూ వలంటీర్లపై ఒక మండల లెవల్ ఆర్గనైజర్ (ఎమ్మెల్వో) ఒత్తిడి చేస్తూ వారితో జరిపిన ఆడియో సంభాషణ వరదయ్యపాళెం మండలంలో చర్చనీయాంశంగా మారింది.వలంటీర్లకు ఎమ్మెల్వోగా వ్యవహరిస్తోన్న ఔట్‌సోర్స్ ఉద్యోగి చంద్రయ్య శుక్రవారం వలంటీర్ల వాట్సాప్ గ్రూప్‌లో మాట్లాడుతూ వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఈసీ నిబంధనలు అడ్డుగా ఉన్నాయని, రాజీనామా చేసి రెండు నెలలు జగనన్న కోసం ప్రచారంలో తిరగాలని ఆదేశించారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం వచ్చాక తీసుకుంటామని చెప్పడంతో స్పందించిన ఒక వలంటీర్ మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకుంటే మా పరిస్థితి ఏమిటని ఆయనను ఫోన్‌లోనే ఎదురు ప్రశ్నలు వేశాడు. దీంతో ఖంగుతిన్న ఎమ్మెల్వో రాసిపెట్టుకో మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తుంది అని వలంటీర్‌కు చెప్పడం గమనార్హం. అయితే ఎమ్మెల్వో వివరణతో సంతృప్తి చెందని సదరు వలంటీర్ ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న తాము రాజీనామా ఎందుకు చేయాలని నిలదీశాడు. ఇన్నాళ్లూ పార్టీలకతీతంగా సేవ చేస్తున్నామని చెప్పుకున్న తాము, ఇప్పుడు పార్టీ జెండా పట్టుకుని ఊళ్లలో ఎలా తిరగాలని తిరగబడ్డాడు. తాము పార్టీ కార్యకర్తలుగా విధుల్లో చేరలేదని, వలంటీర్లుగా చేరామని రాజీనామా చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాడు. కాగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, వలంటీర్ల పర్యవేక్షణ కోసం నియమించబడ్డ ఎమ్మెల్వోలను ప్రభుత్వం నియమించిందా? లేక వైసీపీ నియమించుకుందా అన్నది తెలియరావడంలేదు.

ఆక్రమణలో కాల్వ పోరంబోకు భూమి!





పట్టించుకోరా..

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రెవెన్యూ అధికారులు పట్టించుకోరనుకున్నారో ఏమో కానీ ఆక్రమణదారులు కాల్వపోరంబోకు స్థలంలో నిర్మాణాలకు తెరలేపారు. గతంలో ఇదేభూమిలో చేపట్టిన నిర్మాణాలను అడ్డుకున్న స్థానిక రెవెన్యూ అధికారి ఇప్పుడు పట్టనట్లు వ్యవహరిస్తుండడం ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది.తిరుపతి రూరల్ మండలం చిగురువాడ ఉత్తరపు కండ్రిగలోని శ్రీనిలయ లేఅవుట్‌లో ప్రైవేట్ భూమితో పాటు ప్రభుత్వ కాల్వపోరంబోకు భూమి కూడా కలసిపోయి వుంది. సర్వేనెంబరు 138/1, 139/2లలో వున్న కాల్వపోరంబోకు భూమిలో గతంలో చేపట్టిన నిర్మాణాలను అడ్డుకుని తొలగించిన రెవెన్యూ అధికారులు ఇప్పుడు ఇదే స్థలంలో రెండు మూడు రోజులుగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- తిరుపతి రూరల్

వైసీపీ ప్రచారంలో వలంటీరు



పుత్తూరు అర్బన్, మార్చి 29 : పార్టీల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామనే ఎన్నికల కమిషన్ ఆదేశాలను కొంతమంది వలంటీర్లు బేఖాతరు చేస్తున్నారు. శుక్రవారం పుత్తూరు మండల పరిధిలోని తొరూరులో వైసీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఉత్తరపుకండ్రిగ పంచాయతీకి చెందిన వలంటీర్ నవీన్ వైసీపీ కండువా కప్పుకుని మరీ పార్టీ కరపత్రాలను ఇంటింటికీ అందించాడు.నవీన్ ఉత్తరపుకండ్రి సర్పంచ్ బుజ్జిబాబు కుమారుడు కావడం విశేషం.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : సా. 6.27

సహరి (ఆదివారం) : ఉ. 4.50

ఈ చోద్యం కన్నారా !

● వెల్డింగ్ షాప్‌గా మారిన మహిళా గ్రామ సమాఖ్య మందిరం

తిరుపతి రూరల్ మండలం మంగళంలోని రణధీరపురం పంచాయతీలో ఉన్న మహిళా గ్రామ సమాఖ్య సమావేశ మందిరం ప్రైవేటు వ్యక్తుల వెల్డింగ్ షాపుగా మారిపోయింది.కొంతకాలంగా ఈ భవనంలో వెల్డింగ్‌షాపు నడుస్తోంది.భవనం లోపల, వెలుపల ఇనుప కమ్మీలు, వెల్డింగ్ సామగ్రి, పైపులు, రేకులు పడి వున్నా పంచాయతీ అధికారులు కానీ, మహిళా గ్రామ సమాఖ్య అధికారులు కానీ ప్రశ్నించిన దాఖలాల్లేవు.షాప్ నిర్వాహకుడిని ప్రశ్నిస్తే తాను డీజే సిస్టమ్స్ తయారు చేస్తున్నానని చెప్పుకొచ్చారు.పంచాయతీ కార్యదర్శిని అడగ్గా ఆ భవనం తమ ఆధీనంలోకి రాలేదని మహిళా గ్రామసమాఖ్య వారికే తెలియాలని చెప్పారు. మహిళా గ్రామసమాఖ్య అధికారిని అడిగితే ఆ భవనంపై తాము పేరు మాత్రమే రాశామని, అయితే ఆ భవనం నిర్వహణ పంచాయతీ అధికారులే చూస్తున్నారని చెప్పా రు.ఈ భవనాన్ని వాడుకుంటున్నవారు అద్దె చెల్లిస్తున్నారా, కరెంటు బిల్లు ఎవరు కడుతున్నారు అనేది తెలియాల్సి ఉంది.

- మంగళం



మహిళా గ్రామ సమాఖ్య భవనం ముందు,లోపల ఇనుక కమ్మీలు, పైపులు





భవనం ముందు వెల్డింగ్‌కోసం ఉంచిన ఇనుప పైపులు, రేకులు

ఆదరిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతా: లక్ష్మీసాయిప్రియ



ఆల్తూరుపాడులో ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న లక్ష్మీసాయిప్రియ

డక్కిలి, మార్చి 29: తనను ఆదరించి శాసనసభకు పంపిస్తే వెంకటగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆల్తూరుపాడు గ్రామంలో ఆమె రచ్చబండ నిర్వహించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులు నిలిపివేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి ప్రాజెక్టు పనులు జరగనీయకుండా అడ్డుకొందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే తొలుత ప్రాజెక్టు పనులు మొదలు పెడతామని రైతులకు హామీ ఇచ్చారు. త్వరలో జరుగబోయే ఎన్నికలు యువత, ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తాయని, తనకు ఒక్క అవకాశం ఇస్తే వెంకటగిరి రూపురేఖలు మార్చి చూపుతామన్నారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి వెంకటరెడ్డి, చెలికం భాస్కరరెడ్డి, కుమార్ యాదవ్, కాపా శ్రీనివాసులు నాయుడు, డక్కిలి చంద్రారెడ్డి, అయ్యపరెడ్డి, మునిస్వామి రెడ్డి, శివప్రసాద్, పెంచలరెడ్డి. పిల్లి శ్రీనివాసులు రెడ్డి, మునికృష్ణయ్య, మోపూరు జనార్దనరెడ్డి, రాజయ్యానాయుడు, హరినాద్, పోకూరు రమేష్ నాయుడు, వీపీ చౌదరి, ఆలూరు సుబ్బరామానాయుడు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమత్ చౌదరి, నాని, విష్ణు, చంటి తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటి బిడ్డగా ఆదరించండి

వెంకటగిరి, మార్చి 29: పట్టణంలోని 9వ వార్డులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో వెంకటగిరి నియోజకవర్గం బాగా వెనకబడి పోయిందన్నారు. ఎక్కడ చూసినా రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగ అవకాశాలు, చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యాన్ని మెరుగుపరుస్తామని చెప్పారు. కాగా, ప్రచారంలో భాగంగా శివాలయం ప్రాంతంలో పర్యటించిన లక్ష్మీసాయిప్రియ ఓ టిఫిన్ సెంటర్‌లో దోశలు వేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల డీటీతో మాట్లాడారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, మల్లారపు బాబు, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

కోటలో జయహో బీసీ



సమావేశంలో మాట్లాడుతున్న జలీల్ అహ్మద్

కోట, మార్చి 29: కోట క్రాస్‌రోడ్డులో టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమం జరిగింది. బీసీ నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌తో పాటు మాజీ సీఎం చంద్రబాబునాయుడు బీసీల పక్షపాతిగా వ్యవహరించారన్నారు. బీసీల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బీసీల కోసం ప్రత్యేక కార్పొరేషన్లు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అందరూ కలసికట్టుగా పనిచేసి చంద్రబాబును సీఎంగా, పాశిం సునీల్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుందామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలకృష్ణయాదవ్, తిరుపతి పార్లమెంటు కార్యదర్శి తీగల సురేష్ బాబు, వరిదిగొల్ల కోటేశ్వరప్రసాద్, జలీల్ అహ్మద్, మధుయాదవ్, తల్లం శ్రీనివాసులు, వంశీ, మోహన్, షంషుద్దీన్, నాయబ్, కుమారి తదితరులు పాల్గొన్నారు

కాశీవిశ్వేశ్వరాలయ అభివృద్ధికి సహకారం

తడ, మార్చి 29: చిన్నమాంబట్టులో వెలసిన కాశీవిశ్వేశ్వర, అన్నపూర్ణాదేవి ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈవో నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన ఆలయాన్ని పరిశీలించారు. అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం ట్రస్టు వ్యవస్థాపకుడు, తిరుపతి స్విమ్స్ వైద్యుడు మునస్వామి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తగిన సహకారం అందించాలని, అలాగే శ్రీకాళహస్తి నుంచి ఇక్కడికి ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఈవో నాగేశ్వరరావు తగిన సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్డీవో బాబయ్య, ఆలయ చైర్మన్ మునిశ్రీనివాసులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి

గూడూరు, మార్చి 29: మండలంలోని చెన్నూరు గ్రామంలో గురువారం రాత్రి ఓ విద్యార్థిపై దాడి జరిగిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసుల కథనం మేరకు... మండలంలోని చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి విద్యార్థులు ఫేర్‌వెల్ పార్టీ జరుపుకున్నారు. అదే పాఠశాలలో పదో తరగతి చదివిన లింగసముద్రం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి, ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తన సోదరుడితో కలిసి ఫేర్‌వెల్ పార్టీకి హాజరయ్యారు. వారిద్దరూ తిరిగి గ్రామానికి వెళుతుండగా చెన్నూరు గ్రామానికి చెందిన విష్ణుతో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో విష్ణు కత్తితో ఇంటర్ విద్యార్థిపై దాడి చేసి గాయపరిచాడు. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అరాచక పాలన అంతానికే ప్రజాగళం: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, మార్చి 29: అవినీతి, అరాచకాలతో వ్యవస్థలను నాశనం చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించి తరిమి కొట్టేందుకు ప్రజలను అప్రమత్తం చేస్తూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజాగళం పేరుతో గళమెత్తారని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం నాయుడుపేటలో చంద్రబాబు పాల్గొననున్న ప్రజాగళం కార్యక్రమ ఏర్పాట్లను ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, గూడూరు టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌తో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ సీఎం జగన్ అభివృద్ధి నిరోధకుడని ధ్వజమెత్తారు. కనీసం రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేసిన జగన్ ప్రభుత్వాని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. నాయుడుపేట పట్టణంలో పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం సర్కిల్ వద్ద శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రజాగళం సభలో చంద్రబాబునాయుడు పాల్గొన్ని వైసీపీ అరాచకాలను ఎండగట్టనున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రజాగళం సభను విజవంతం చేద్దామని పిలుపునిచ్చారు తన కుమార్తె నెలవల విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు అంతా సన్నద్ధం కావాలని అన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మరళీకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు శ్రీరాంప్రసాద్, విజయ్‌కుమార్ నాయుడు, రఫీ, నెలవల రాజేష్, గాలి రమేష్‌నాయుడు, హరిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం





గూడూరులో ఎన్టీఆర్ విగ్రహానికి, నాయుడుపేటలో చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మార్చి 29: పేదల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ అగ్రకులాలకే పరిమితమైన రాజకీయ అధికారాన్ని బీసీ, ముస్లిం, ఎస్సీ, ఎస్టీలకు చేరువ చేసిందన్నారు. అభివృద్ధితో పాటు ఎన్నో సంక్షేమ పథకాలతో బడుగులకు అండగా నిలిచిందన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కుతో పాటు విద్య, ఉపాధి, రాజకీయాలో సముచిత స్థానం కల్పించిందని కొనియాడారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, నరసింహులు నాయుడు, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, తాళ్ల సుబ్బమ్మ, వాటంబేడు శివకుమార్, ఇశ్రాయిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్, అంబేడ్కర్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, బొమ్మన శ్రీధర్, రఫీ, కిష్టయ్య, అశోక్ రెడ్డి, వేమసాని శోభన్‌నాయుడు, గూడూరు సుధీర్‌రెడ్డి, మధునాయుడు, రాజేంద్ర, న్యాయవాదులు పసల గంగాప్రసాద్, పసల చెంగయ్య, అవధానం సుధీర్, బొమ్మన పళణి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: టీడీపీ మండల కన్వీనర్ గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, ఓజిలి యూనిట్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, ముస్లిం నాయకుడు ఎస్‌కే ఖలీల్, సీనియర్ నాయకులు ఎద్దల ధనుంజయరెడ్డి, రవీంద్రారెడ్డి, కార్తీక్‌రాజు, వెంకటేశ్వర్లు నాయుడు, కోటిరాజు, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

కోట: కోట క్రాస్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. జెండా ఎగురవేశారు. ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, తీగల సురేష్‌బాబు, బాలకృష్ణయాదవ్, కోటేశ్వరప్రసాద్, మధుయాదవ్, షంషుద్దీన్, నాయబ్, శ్రీనివాసులు, వంశీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తడ: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, బొమ్మన పళణి, సెల్వం, నీలకంఠం, రవి, శ్యామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఎగురవేసి స్వీట్లు పంచారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, బీసీ సెల్ నాయకులు చిట్టేటి పెరుమాల్, వాకచర్ల రమేష్, మెస్ రమణయ్య, బుద్ధి విజయలక్ష్మి, ఆలీ బాయ్, మేడా సాయినారాయణ, బుద్ధి విజయలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిత



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశం జశ్వంత్‌కుమార్

గూడూరు అర్బన్, మార్చి 29: టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కుమారుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టుసెంటర్ ప్రాంతంలో శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని, ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని నమ్మించి మోసం చేసిందన్నారు. చంద్రబాబునాయుడు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఎన్నో పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, ఛాన్‌బాషా, అబ్దుల్‌రహీం, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళాన్ని విజయవంతం చేయండి



సమావేశమైన టీడీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 29: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం నాయుడుపేటలో నిర్వహించే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగే సభలో, ఏఎల్‌సీఎం గ్రౌండ్ హెలిప్యాడ్ నుంచి చేపట్టే బైక్ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ జిల్లా కార్యదర్శి వేలూరు మురళీరెడ్డి, నాయకులు విన్నమాల మధురెడ్డి, మైలారి రాజశేఖర్, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, జీవీఆర్ నాయుడు, జువ్వలపాటి మస్తాన్, ధనంజయ్య, చంద్రారెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

సూళ్లూరుపేట, మార్చి 29: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయుడుపేటలో చంద్రబాబు నిర్వహించే ప్రజాగళం సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి పనిచేసి టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీని గెలుపించుకోవాలన్నారు. తాను అలకబూనాని చెప్పడం అవాస్తవమని, చంద్రబాబు మాటే తనుకు శిరోధార్యమని, చివరి రక్తపుబొట్టు వరకు టీడీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, బీసీ సెల్ నాయకులలు సుబ్రహ్మణ్యం, ఎల్లయ్య, గురుకుల సుబ్రమణ్యం, పాకం వెంకటసుబ్బయ్య, నాపా మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను విజయవంతం చేద్దాం: టీడీపీ

పెళ్లకూరు, మార్చి 29: నాయుడుపేటలో శనివారం జరగనున్న చంద్రబాబునాయుడు ప్రజాగళం సభను విజయవంతం చేద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తూరులో శుక్రవారం ఆయన టీడీపీ సీనియర్ నాయకుడు దామెర ప్రసాద్‌నాయుడుతో కలసి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రాపూరు పరుశురామ్ పాల్గొన్నారు.

ఒకదాన్నొకటి ఢీకొన్న నాలుగు వాహనాలు

ప్రయాణికులు సురక్షితం

చిల్లకూరు, మార్చి 29: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుంచి చెన్నై వెళ్లే మార్గంలో గేదె అడ్డం రావడంతో ఓ కారు అకస్మాత్తుగా ఆగడంతో వెనుక వస్తున్న మూడు కార్లు, ఆర్టీసీ బస్సు ఒకదాన్ని ఒకటి వెనుక నుంచి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు, బస్సులో ప్రయాణిస్తున్న ఎవరికీ ఏలాంటి గాయాలు కాలేదు. రెండు కార్లు, ఆర్టీసీ బస్సు దెబ్బతిన్నాయి.

4 నుంచి 'సదరం' స్లాట్‌ల బుకింగ్

గూడూరు, మార్చి 29: వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగులు పొందే ప్రయోజనాల కోసం అవసరమైన 'సదరం' సర్టిఫికెట్ల జారీ కోసం స్క్రీనింగ్ పరీక్షలు చేయడానికి స్లాట్ బుకింగ్‌లు ఏప్రిల్ 4వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఎంపిక చేసిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన స్లాట్ బుకింగ్‌లు వాటితో పాటు శారీరక పరీక్షలు ఈనెలాఖరుతో పూర్తి కానున్నాయి. ఇక ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన కొత్త స్లాట్‌లు అందుబాటులోకి రానున్నాయి. స్లాట్ బుకింగ్‌లు 4వ తేదీ అందుబాటులోకి వస్తున్నా ఏప్రిల్ నెల 8వ తేదీ నుంచి ఎంపిక చేసుకున్న స్లాట్ తేదీలను బట్టి ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. ఆర్థోపెడిక్, మానసిక, కంటి, ఈఎన్‌టీ వైకల్యం ఉన్న వారు నిర్ధారణ సర్టిఫికెట్ల కోసం స్క్రీనింగ్ చేసి అంగవైకల్య శాతాన్ని నిపుణులు నిర్ధారించి ధ్రువపత్రాలు అర్హులైన వారికి జారీ చేస్తారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, బస్సులు, రైళ్లలో ప్రయాణాలు, సామాజిక పింఛన్లు తదితర సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు సదరం కేంద్రాలు జారీ చేసే ధ్రువపత్రాలు మాత్రమే ప్రామాణికమవుతాయి. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ జనరల్, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో సదరం పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో సోమవారం, గురువారం మాత్రమే పరీక్షలు నిర్వహించనున్నారు. కాబట్టి దివ్యాంగులు తమకు అనువైన రోజులను, ఆసుపత్రులను స్లాట్ బుకింగ్ ద్వారా ఎంపిక చేసుకోవచ్చు. తమ సమీపంలోని సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో 4వ తేదీ నుంచి ఈ స్లాట్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి.

సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ వితరణ



తడ, మార్చి 29: శ్రీసిటీలోని క్యాడ్‌బరీ డెయిరీ మిల్క్, ఓరియో, బోర్న్‌విటా వంటి దిగ్గజ బ్రాండ్‌ల తయారీ పరిశ్రమ మోండెలెజ్ ఇండియా, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా శుక్రవారం సూళ్లూరుపేట కమ్యూనిటీ ప్రభుత్వాస్పత్రికి రూ.30 లక్షల విలువైన అధునాతన వసతులు కలిగిన అంబులెన్స్‌ను వితరణగా ఇచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి(డీఎంఅండ్‌హెచ్‌వో) కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డా.శ్రీహరికి మెండెలెజ్ ప్లాంటు డైరెక్టర్ అమిత్‌జైన్ అధికారికంగా అంబులెన్స్ తాళాలను అందజేశారు.

పెంతాలిన్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



ఆర్తి, పద్మావతి

గూడూరు, మార్చి 29: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో శనివారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ మోడరన్ పెంతాలిన్ పోటీల్లో గూడూరు జడ్పీబాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొంటారని పీడీ విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. మూడురోజుల క్రితం నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ మోడరన్ పెంతాలిన్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. శనివారం నుంచి తిరుపతిలో జరగనున్న స్విమ్మింగ్, పరుగు పదెం పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులకు హెచ్‌ఎం మాధవీలక్ష్మి అభినందనలు తెలిపారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వెంకటగిరిటౌన్, మార్చి 29: గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించాలని ఎంపీడీవో నీలకంటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి పంపులను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలన్నారు. నీటి సరఫరా పథకాల నిర్వహణ, వాటి పర్యవేక్షణ ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శ్రీనివాసులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అళఘునాథస్వామికి లక్షతులసీ పూజ

గూడూరు అర్బన్, మార్చి 29: స్థానిక అళఘునాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భూదేవి, శ్రీదేవి సమేత అళఘునాథస్వామిని ప్రత్యేకంగా ఆలంకరించి లక్షతులసీ పూజ జరిపారు. రాత్రి స్వామివారికి ఏకాంతసేవను జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఓటు వజ్రాయుధం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కోట, మార్చి 29: ఓటు వజ్రాయుధంతో సమానమని అధికారులు అన్నారు. కోట పట్టణంలో శుక్రవారం ఓటు ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్రాస్‌రోడ్డులో మానవహారం ఏర్పాటు చేశారు. తహసీల్దారు నాగరాజరావు, ఎంపీడీవో శంకరయ్య, ఎస్ఐ నాగబాబు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు

ముగ్గురి అరెస్టు

కోట, మార్చి 29: మండలంలోని రుద్రవరం శివార్లలో కోడి పందేల స్థావరంపై శుక్రవారం రాత్రి ఎస్ఐ నాగబాబు జరిపిన ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక మోటారు బైక్, 15 కత్తులు, రూ.2,500 నగదు, మూడు కోడిపుంజులను స్వాధీనం చేసుకొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

వినాయకుడికి అభిషేకం

గూడూరు అర్బన్, మార్చి 29: స్థానిక తూర్పువీధిలోని గణపతి ఆలయంలో శుక్రవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా వినాయకుడి విగ్రహానికి అర్చకులు పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇంట్లో చోరీ

తడ, మార్చి 29: తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరి జరిగింది. మండల పరిధిలోని పాములమిట్ట గ్రామానికి చెందిన బూదూరు చంద్రయ్య కుటుంబ సభ్యులు గురువారం ఉదయం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలను తీసి ఉండటం, లోపల బీరువాను తెరచి ఉండటంతో పాటు పది సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


పేలిన గ్యాస్ సిలిండర్

పూరిల్లు దగ్ధం

చిట్టమూరు, మార్చి 29: చిట్టమూరు మండలం కోగిలి గ్రామంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి మునీంద్ర ఇంటిలోని సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లోని సామగ్రి, రూ.15 వేల నగదు, కొంత బంగారు ఆభరణాలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

సరుకుల పంపిణీ

కోట, మార్చి 29: పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కర్, నాగజ్యోతి దంపతుల ఆర్థిక సౌజన్యంతో అర్చకులు, పురోహితులకు సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు సిద్ధేశ్వరరావు, రామిశెట్టి, అర్చకులు హేమంత్, రామమూర్తి, నరేష్, కృష్ణమాచార్యులు, అనిత, అనురాధ, గిరి, రాజా, రంగాచార్యులు పాల్గొన్నారు.


జై తెలుగుదేశం !
జై జై తెలుగుదేశం!!
స్వాగతం సుస్వాగతం
ఆంధ్రప్రజల భవిష్యత్తుకు భరోసానిస్తూ
ప్రజాగళం
కార్యక్రమానికి
నేడు తిరుపతి పార్లమెంటు పరిధిలోని
సూళ్ళూరుపేట నియోజకవర్గం
నాయుడుపేటకు విచ్చేయుచున్న
అభివృద్ధి సాధకుడు
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు
మాన్యశ్రీ గౌ॥ నారా చంద్రబాబు నాయుడు గారికి
స్వాగత సుమాంజలులు తెలుపుతూ..
బహిరంగ సభకు విచ్చేయుచున్న
బిజెపి - తెలుగుదేశం - జనసేన
అతిరథమహారథులకు, నాయకులకు,
కార్యకర్తలకు, అభిమానులకు
స్వాగతం సుస్వాగతం
బహిరంగ సభ
తేది : 30-03-2024, మ॥ 2.00 గం॥కు
స్థలం : అంబేద్కర్ విగ్రహం వద్ద, బస్టాండ్ సెంటర్, నాయుడుపేట
కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ
వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి
నెలవల విజయశ్రీ
సూళ్ళూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి
పాశం సునీల్ కుమార్
గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి
కోనేటి ఆదిమూలం
సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి
వి.వరప్రసాద రావు
తిరుపతి ఎం.పి. అభ్యర్థి

కోల్‌కతా టాప్‌షో

బెంగళూరు ఓటమి ● విరాట్ పోరాటం వృధా


అదరగొట్టిన వెంకటేశ్, నరైన్

సునీల్ నరైన్ (22 బంతుల్లో 47)

బెంగళూరు: కోల్‌కతా నైట్‌రైడర్స్ నుంచి మరో అదిరిపోయే ప్రదర్శన. టాపార్డర్‌లో వెంకటేశ్ అయ్యర్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50), ఓపెనర్లు సునీల్ నరైన్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 47), ఫిలిప్ సాల్ట్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చిన్నస్వామి స్టేడియంలో బౌండరీల వర్షం కురిపించారు. దీంతో భారీ ఛేదనను అలవోకగా ముగిస్తూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)పై 7 వికెట్లతో భారీ విజయం సాధించింది. అలాగే తాజా సీజన్‌లో హోం గ్రౌండ్‌లో ఓడిన తొలి జట్టుగా ఆర్‌సీబీ నిలవగా, ఈ మైదానంలో నైట్‌రైడర్స్‌కిది వరుసగా ఆరో విజయం. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 83 నాటౌట్) ఒక్కడే రాణించడంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. కామెరూన్ గ్రీన్ (21 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 33) ఫర్వాలేదనిపించాడు. రస్సెల్, హర్షిత్ రాణాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో కోల్‌కతా 16.5 ఓవర్లలో 3 వికెట్లకు 186 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ అయ్యర్ (39 నాటౌట్) సత్తా చాటాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నరైన్ నిలిచాడు.

బాదుడే బాదుడు: ఛేదన కోసం బరిలోకి దిగిన కేకేఆర్ పరుగుల ప్రవాహం తొలి బంతి నుంచే సాగింది. ఆర్సీబీ బౌలర్లు తమ సొంత మైదానంలోనూ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. వైశాక్ మాత్రం పొదుపుగా బౌలింగ్ చేయగలిగాడు. ఓపెనర్లు నరైన్, సాల్ట్ ధాటిగా ఆడేస్తూ పవర్‌ప్లేలోనే ఏకంగా 85 పరుగులు సాధించారు. ఇది ఆ జట్టు తరఫున రెండో అత్యధికం. చాలా రోజుల తర్వాత నరైన్ తన బ్యాట్ పవర్ చూపించగా, అటు సాల్ట్ తొలి ఓవర్‌లోనే 6,4,6తో 18 పరుగులు రాబట్టాడు. మరో ఎండ్‌లో నరైన్ మూడో ఓవర్‌లో రెండు సిక్సర్లతో అలరించాడు. దీంతో 21 బంతుల్లోనే జట్టు 50 పరుగులకు చేరింది. ఆరో ఓవర్‌లో నరైన్ మరింత విజృంభిస్తూ 4,6,6 బాదేయడంతో 21 పరుగులు వచ్చాయి. అయితే హాఫ్ సెంచరీ ఖాయమని భావించిన నరైన్‌ను మయాంక్ దాగర్ యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 39 బంతుల్లో 86 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే సాల్ట్‌ను వైశాక్ అవుట్ చేసినా వెంకటేశ్ అయ్యర్ రూపంలో కేకేఆర్ ఆటలో వేగం తగ్గలేదు. తొమ్మిదో ఓవర్‌లోనే స్కోరు వంద పరుగులకు చేరగా.. అటు అయ్యర్ ఆటలో వీలైనంత త్వరగా మ్యాచ్‌ను ముగించాలనే కసి కనిపించింది. దీంట్లో భాగంగా అల్జారి ఓవర్‌లో 6,4,6,4తో 20 పరుగులు రాబట్టాడు. అటు కెప్టెన్ శ్రేయాస్ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ సహకరించాడు. 14 ఓవర్లలోనే స్కోరు 150కి చేరడంతో ఆర్సీబీ ఓటమి ఖరారైంది. 29 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన వెంటనే వెంకటేశ్‌ను యష్ దయాల్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి 29 బంతుల్లో 16 పరుగులే కావాల్సి ఉండగా.. శ్రేయాస్, రింకూ (5 నాటౌట్) మరో 19 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించారు.


విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 83 నాటౌట్)

1
బెంగళూరు తరఫున ఎక్కువ సిక్సర్లు (241)బాదిన బ్యాటర్‌గా కోహ్లీ. గేల్ (239)ను దాటాడు.

విరాట్ అజేయ ఇన్నింగ్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి శుభారంభం దక్కకపోయినా విరాట్ మెరుపు ఇన్నింగ్స్‌తో తుది కంటా నిలిచి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. అతడికి గ్రీన్, మ్యాక్స్‌వెల్ (28) చివర్లో దినేశ్ కార్తీక్ (20) సహకరించారు. ఇక ఈ మ్యాచ్‌లోనూ కేకేఆర్ రూ. 24 కోట్ల విలువైన బౌలర్ స్టార్క్ పూర్తిగా తేలిపోవడం గమనార్హం. ఓపెనర్ డుప్లెసి (8) రెండో ఓవర్‌లోనే వెనుదిరగ్గా, మూడో ఓవర్‌లో విరాట్ 6,4.. గ్రీన్ ఫోర్‌తో 17 రన్స్ సమకూరాయి. ఇక ఆరో ఓవర్‌లోనూ గ్రీన్ చెలరేగి వరుసగా 4,4,6తో 15 రన్స్ రాబట్టడంతో జట్టు పవర్‌ప్లేను 61 పరుగులతో ముగించింది. కానీ ఆ తర్వాత పరుగుల వేగం తగ్గింది. గ్రీన్‌ను రస్సెల్ బౌల్డ్ చేయడంతో రెండో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే 12వ ఓవర్‌లో విరాట్ సిక్సర్, మ్యాక్స్‌వెల్ 4,4తో స్కోరులో కాస్త కదలిక కనిపించింది. అటు మ్యాక్స్ వరుస ఓవర్లలో ఇచ్చిన రెండు సులువైన క్యాచ్‌లను రమణ్‌దీప్, నరైన్ వదిలేశారు. అయితే అతడిని ఎక్కువ సేపు క్రీజులో నిలువకుండా కేకేఆర్ చూడగలిగింది. 15వ ఓవర్‌లో రింకూ క్యాచ్‌తో తను పెవిలియన్‌కు చేరాడు. తర్వాతి వరుస ఓవర్లలోనే రజత్ (3)ను రస్సెల్.. అనూజ్ (3)ను హర్షిత్ అవుట్ చేయడంతో పాటు పరుగులను కూడా కట్టడి చేశారు. కానీ 19వ ఓవర్‌లో దినేశ్ కార్తీక్ రెండు సిక్సర్లతో మురిపించాడు. అలాగే ఆఖరి ఓవర్‌లోనూ విరాట్, డీకే చెరో సిక్సర్‌తో ఆర్‌సీబీ స్కోరు 180 దాటింది.

నేటి మ్యాచ్
లఖ్‌నవూ x పంజాబ్
రాత్రి 7.30 గం. నుంచి

స్కోరుబోర్డు

బెంగళూరు: విరాట్ కోహ్లీ (నాటౌట్) 83, డుప్లెసి (సి) స్టార్క్ (బి) హర్షిత్ 8, గ్రీన్ (బి) రస్సెల్ 33, మ్యాక్స్‌వెల్ (సి) రింకూ (బి) నరైన్ 28, పటీదార్ (సి) రింకూ (బి) రస్సెల్ 3, అనూజ్ (సి) సాల్ట్ (బి) హర్షిత్ 3, దినేశ్ (రనౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 182/6; వికెట్ల పతనం:** 1-17, 2-82, 3-124, 4-144, 5-151, 6-182; **బౌలింగ్:** స్టార్క్ 4-0-47-0, హర్షిత్ రాణా 4-0-39-2, అనుకూల్ 2-0-6-0, నరైన్ 4-0-40-1, రస్సెల్ 4-0-29-2, వరుణ్ చక్రవర్తి 2-0-20-0.

కోల్‌కతా: సాల్ట్ (సి) గ్రీన్ (బి) వైశాక్ 30, నరైన్ (బి) దాగర్ 47, వెంకటేశ్ అయ్యర్ (సి) కోహ్లీ (బి) యష్ దయాల్ 50, శ్రేయాస్ అయ్యర్ (నాటౌట్) 39, రింకూ సింగ్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 16.5 ఓవర్లలో 186/3; వికెట్ల పతనం:** 1-86, 2-92, 3-167; **బౌలింగ్:** సిరాజ్ 3-0-46-0, యష్ దయాల్ 4-0-46-1, అల్జారీ జోసెఫ్ 2-0-34-0, మయాంక్ దాగర్ 2.5-0-23-1, వైశాక్ 4-0-23-1, గ్రీన్ 1-0-7-0.

4
టీ20ల్లో 500 మ్యాచ్‌లు పూర్తి చేసిన నాలుగో క్రికెటర్‌గా సునీల్ నరైన్. పొలార్డ్ (660), బ్రావో (573), షోయబ్ మాలిక్ (542) ముందున్నారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
చెన్నై	2	2	0	0	4	1.979
కోల్‌కతా	2	2	0	0	4	1.047
రాజస్థాన్	2	2	0	0	4	0.800
హైదరాబాద్	2	1	1	0	2	0.675
పంజాబ్	2	1	1	0	2	0.025
బెంగళూరు	3	1	2	0	2	-0.711
గుజరాత్	2	1	1	0	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	0	-0.528
ముంబై	2	0	2	0	0	-0.925
లఖ్‌నవూ	1	0	1	0	0	-1.000

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



సెమీస్‌లో సిక్కి జోడీ

● క్వార్టర్స్‌లో సింధు ఓటమి
● స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ

మాడ్రిడ్: సిక్కిరెడ్డి జోడీ జోరు కొనసాగిస్తూ స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకుపోయింది. ఇక స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌లో ఓటమితో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించగా, డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప ద్వయం కూడా పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సిక్కిరెడ్డి/సుమిత్ రెడ్డి జంట 14-21, 21-11, 21-17తో నాలుగో సీడ్ ఇండోనేసియా ద్వయం రేహాన్ నౌఫల్/లిసా కుసుమావతిని చిత్తు చేసింది. ఫైనల్లో చోటు కోసం ఆరోసీడ్ ఇండోనేసియా జోడీ రినోవ్ రివాల్డీ/పిటా హనింగ్త్యస్‌తో సిక్కి ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్లో రెండో సీడ్ సింధు 26-24, 17-21, 20-22తో సుపనిద కటెథాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది. మహిళల డబుల్స్ రౌండ్-8లో మూడో సీడ్ అశ్వినీ పొన్నప్ప/తనీషా క్రాస్టో జంట 13-21, 19-21తో ఆరో సీడ్ లీ చియా/టెంగ్ చున్ (తైపీ) జోడీ చేతిలో ఓడిపోయింది. కాగా, పురుషుల డబుల్స్‌లో భారత జంట ఎమ్ఆర్ అర్జున్/ధ్రువ్ కపిల జోడీకి క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. రెండోసీడ్‌గా బరిలోకి దిగిన అర్జున్ ద్వయంపై 21-19, 21-23, 21-17తో మలేసియా జంట జునైది ఆరిఫ్/రా కింగ్ యాప్ గెలిచింది.

'పారిస్'లో పతాకధారిగా నీరజ్‌ను ఎందుకు ఎంపిక చేయలేదు?

ప్రశ్నించిన అంజూ బాబీ జార్జ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా నీరజ్ చోప్రాను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని దిగ్గజ లాంగ్‌జంపర్ అంజూ బాబీ జార్జ్ ప్రశ్నించింది. వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్‌ను బృందం నాయకుడిగా ఎంపిక చేస్తూ భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈ నిర్ణయంపై అంజూ స్పందిస్తూ 'టేబుల్ టెన్నిస్ సమాఖ్య సహా అన్ని క్రీడా సంఘాలు పారిస్ గేమ్స్‌కు తమ జట్లను ఇంకా ప్రకటించనేలేదు. అలాంటప్పుడు ఒలింపిక్స్‌లో పాల్గొనడం ఖాయమైన నీరజ్ చోప్రాను పతాకధారిగా నియమించకపోవడం ఆశ్చర్యకరం' అని వ్యాఖ్యానించింది.

ఒలింపిక్స్ భద్రతకోసం విదేశీ సాయం



పారిస్: ఈ జూలై-ఆగస్టు నెలల్లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న ఫ్రాన్స్.. క్రీడలకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించేందుకు ఇతర దేశాల సాయాన్ని కోరుతోంది. రెండు వేలమందికిపైగా పోలీసు అధికారులను పంపాలని 46 దేశాలను అభ్యర్థించింది. 2022లో ఖతార్‌లో జరిగిన వరల్డ్ కప్ ఫుట్‌బాల్‌కు రక్షణ కల్పించేందుకు తమ దేశం నుంచి 200 మంది పోలీసులు, పారా మిలటరీ సిబ్బందిని పంపిన విషయాన్ని ఫ్రాన్స్ అంతర్గత మంత్రిత్వ శాఖ గుర్తు చేసింది. అలాగే కొద్ది సంఖ్యలో మిలిటరీ సిబ్బందిని కూడా పంపాలని పలు దేశాలను ఫ్రాన్స్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా కోరింది.

అమెరికా జట్టులో కోరె అండర్సన్



న్యూయార్క్: న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ కోరె అండర్సన్ ఇకపై అమెరికా క్రికెట్ జట్టు తరఫున ఆడబోతున్నాడు. కెనడాతో జరిగే ఐదు టీ20ల సిరీస్ కోసం మోనాంక్ పటేల్ నేతృత్వంలో 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. 2018లో కివీస్ తరఫున చివరి మ్యాచ్ ఆడిన 33 ఏళ్ల అండర్సన్ 2020లో అమెరికాకు వచ్చాడు. అక్కడి దేశవాళీ మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారించడంతో ఇప్పుడు జాతీయ జట్టుకు ఆడనున్నాడు. గతంలో భారత అండర్-19కు ఆడిన హర్మీత్ సింగ్, ఢిల్లీ బ్యాటర్ మిలింద్ కుమార్, కెనడా జట్టు మాజీ కెప్టెన్ నితిష్ కుమార్ కూడా టీమ్‌లో ఉన్నారు. అయితే యూఎస్‌లో క్రికెట్ ఆడుతున్న ఉన్ముక్త్ చంద్‌కు మాత్రం నిరాశే ఎదురైంది.

టీ20 కెప్టెన్‌గా మళ్లీ బాబర్!

షహీన్ అవుట్?



కరాచీ: పాకిస్థాన్ టీ20 జట్టు కెప్టెన్‌గా షహీన్ షా అఫ్రీది స్థానంలో బాబర్ ఆజమ్ నియామకం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చేనెల 18నుంచి స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తోనే బాబర్ తిరిగి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో జట్టు దారుణ వైఫల్యం దరిమిలా మూడు ఫార్మాట్లలో ఆజమ్ కెప్టెన్సీపై వేటు పడింది. అనంతరం టీ20 జట్టు సారథిగా నవంబరులో అఫ్రీది నియమితుడయ్యాడు. అతడి హయాంలో ఒకటే టీ20 సిరీస్ కివీస్‌తో ఆడిన పాక్ 1-4తో ఓడింది.

సోషల్ మీడియాను పట్టించుకోవద్దు!

● హార్దిక్‌కు స్మిత్ బాసట

న్యూఢిల్లీ: ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై క్రికెట్ ఫ్యాన్స్ విమర్శలు అసంబద్ధమని ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ అన్నాడు. సోషల్ మీడియాలో వాటిని హార్దిక్ చూడడం మానేయాలని సూచించాడు. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించిన రోహిత్‌ను పక్కనబెట్టిన ముంబై ఫ్రాంచైజీ ఈ సీజన్‌కు హార్దిక్‌ను కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. దాంతో గరంగరంగా ఉన్న రోహిత్ అభిమానులు పాండ్యాపై విమర్శల దాడికి దిగారు.

బిజినెస్



పసిడి సరికొత్త రికార్డు

2023-24లో రూ.8,730 అప్

ఒక్కరోజే రూ.1,420 పెరుగుదల, తులం రూ.68,730

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు 2,250 డాలర్ల ఎగువకు

హైదరాబాద్: బంగారం మళ్లీ కొండెక్కుతోంది. శుక్రవారం నాడు హైదరాబాద్‌లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ఒక్కరోజే రూ.1,420 పెరిగి రూ.68,730కి చేరుకుంది. ధర రూ.68,000 దాటడం ఇదే తొలిసారి. 22 క్యారెట్ల బంగారం సైతం రూ.1,300 పెరిగి రూ.63,000కు ఎగబాకింది. కిలో వెండి రూ.80,800 పలికింది. అంతర్జాతీయంగా బంగారం, వెండి ధర పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలు ఊపందుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2,254 డాలర్లకు పుంజుకుంది. వెండి 25.10 డాలర్ల వద్ద ట్రేడైంది. ఒక్క మార్చి నెలలోనే ఔన్సు బంగారం 9 శాతం పెరిగింది. 2020 జూలై తర్వాత అత్యధిక నెలవారీ వృద్ధి ఇది. అంతేకాదు, వరుసగా రెండు త్రైమాసికాలుగా బంగారం ప్రియమవుతూనే వచ్చింది.

2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.60,000 స్థాయిలో ఉన్న తులం బంగారం.. ఈ ఆర్థిక సంవత్సరం చివరికి మరో రూ.8,730 పెరుగుదలతో రూ.68,730కి చేరుకుంది. అంటే పసిడి ఇన్వెస్టర్ల పెట్టుబడి విలువ ఏడాది కాలంలో 14.6 శాతం పెరిగింది. ఫెడ్ రేట్ల తగ్గింపుపై మరింత స్పష్టత వస్తే, బంగారం రేటు మరింత పుంజుకునే అవకాశాలున్నాయని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరినాటికి వడ్డీరేట్లను 0.75 శాతం మేర తగ్గించే అవకాశాలున్నాయని ఫెడ్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. సాధారణంగా ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో అమెరికన్ డాలర్, బాండ్ల రేట్లు పెరుగుతూ పోతే.. బంగారం తగ్గుతూ వస్తుంది.

కొత్త ఇళ్ల సరఫరా తగ్గింది

కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో కొత్త ఇళ్ల సరఫరా జనవరి-మార్చి త్రైమాసికంలో సగటున 15 శాతం తగ్గిందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ తాజా నివేదికలో తెలిపింది. బెంగళూరు, ముంబై నగరాల్లో మాత్రం సరఫరా స్వల్పంగా పెరిగిందని; ఢిల్లీ ఎన్‌సీఆర్, చెన్నై, హైదరాబాద్, పుణె, కోల్కతా, అహ్మదాబాద్‌లలో తగ్గిందని పేర్కొంది. దేశవ్యాప్తంగా గత ఏడాది ఇదే త్రైమాసికంలో 81,167 ఇళ్లు అందుబాటులోకి రాగా ఈ ఏడాది 69,143 యూనిట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయని పేర్కొంది. హైదరాబాద్‌లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇళ్లు గత ఏడాది జనవరి-మార్చితో పోల్చితే 14,371 యూనిట్ల నుంచి 11,090కి తగ్గాయి. ఈ ఎనిమిది నగరాల్లోనూ మొత్తం ఇళ్ల అమ్మకాల్లో విలాసవంతమైన భవనాల వాటా 34 శాతం ఉన్నట్టు పేర్కొంది.

ఎఫ్‌పీఐ పెట్టుబడుల వరద

2023-24లో మొత్తం రూ.3.4 లక్షల కోట్లు రాక

న్యూఢిల్లీ: ఈ నెల 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత మార్కెట్లోకి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) పోటెత్తాయి. డిపాజిటరీల వద్దనున్న సమాచారం ప్రకారం.. ఈసారి ఎఫ్‌పీఐలు ఈక్విటీ మార్కెట్లో రూ.2.08 లక్షల కోట్లు, డెట్ మార్కెట్లోకి మరో రూ.1.2 లక్షల కోట్లు కలిపి మొత్తం రూ.3.4 లక్షల కోట్లు గుమ్మరించారు. అంతర్జాతీయ ప్రతికూలతల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో మాత్రం మన ఈక్విటీల నుంచి విదేశీ పెట్టుబడులు వెనక్కి తరలిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నికరంగా రూ.37,632 కోట్లు, 2021-22లో రూ.1.4 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌పీఐల రాకపై మజర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ అప్రమత్తతతో కూడిన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రగతిశీల సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయ పెట్టుబడి మార్గాలు ఎఫ్‌పీఐల జోరు కొనసాగేందుకు దోహదపడవచ్చన్నారు. అయితే, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఆందోళనలు పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపవచ్చన్నారు.

జీ బెంగళూరు కేంద్రంలో సగం మంది ఔట్

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీఎల్) ఉద్యోగుల కోతలకు దిగింది. బెంగళూరులోని కంపెనీ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్ కేంద్రంలో (టీఐసీ) పని చేస్తున్న ఉద్యోగుల్లో సగం మందిని ఇంటికి పంపించింది. ఖర్చుల తగ్గింపులో భాగంగా ఈ చర్య తీసుకున్నట్టు కంపెనీ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. అయితే ఎంత మంది ఉద్యోగులను తొలగించిందీ వెల్లడించలేదు. కంపెనీ తాజా వార్షిక నివేదిక ప్రకారం ఈ కేంద్రంలో 650 మందికిపైగా ఇంజినీర్లు పని చేస్తున్నారు. దీంతో వీరిలో కనీసం సగం మంది రోడ్డున పడినట్టు భావిస్తున్నారు.

యశోదాలో ఫ్యూజిఫిలిం అత్యాధునిక అల్ట్రా సౌండ్ పరికరం



హైదరాబాద్: డయాగ్నస్టిక్ ఇమేజింగ్‌లో అగ్రగామి అయిన ఫ్యూజిఫిలిం అత్యాధునికమైన అరీటా 850 డయాగ్నస్టిక్ అల్ట్రాసౌండ్ సిస్టమ్‌ను యశోదా ఆస్పత్రిలో ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఇలాంటి అత్యాధునిక యంత్రం అందుబాటులోకి రావడం ఇదే ప్రథమమని ఫ్యూజిఫిలిం తెలిపింది. ఉదరకోశ వ్యాధులను ప్రత్యేకించి ఉదరకోశంలోను, చుట్టుపక్కల ప్రాంతాల్లోను ఏర్పడే కేన్సర్ టిష్యూలను గుర్తించి సకాలంలో సరైన చికిత్స అందించడానికి ఈ ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ యంత్రం ఎంతో సహాయకారి అవుతుందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	375	విజయవాడ	400
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	400	వరంగల్	377
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	122	విజయవాడ	121
వరంగల్	122	గుంటూరు	122
కరీంనగర్	122	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	122	చిత్తూరు	135
కర్నూలు	123	నెల్లూరు	135
విశాఖపట్నం	117	అనంతపురం	121
గోదావరి	121		

మార్చి 31 వచ్చేస్తోంది


పన్ను ప్లానింగ్‌లో తడబాటు వద్దు

పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడులు ఆయా వ్యక్తుల దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక లక్ష్యానికి అనుగుణంగా ఉండాలి. ఈ విషయం ఆలోచించకుండా పన్ను ఆదా పథకాల్లో మదుపు చేస్తే కొద్ది మొత్తంలో పన్ను ఆదా ఐనా, రాబడులు పెద్దగా ఉండవు. మార్కెట్ అనుకూలించక పోతే ఈఎల్ఎస్ఎస్, యులిప్స్ వంటి పన్ను ఆదా పథకాల్లో అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంది.

ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంక ఒక రోజే వ్యవధి ఉంది. పన్ను ప్లానింగ్ ఇంకా పూర్తి చేయని వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులు పన్ను తగ్గించుకునేందుకు చివరి క్షణం చర్యలకు పరుగులు తీస్తారు. ఏ పథకంలో మదుపు చేస్తే అధిక లాభం పొందగలమా అని ఆదుర్దా పడుతుంటారు. ఇది డిస్ట్రిబ్యూటర్లు, బ్రోకర్లకు పండగ. మా పథకం మంచిదంటే మాదంటూ వెంటపడుతుంటారు. పన్ను చెల్లింపుదారులు కూడా పన్ను భారం తగ్గించుకోవడమే ముఖ్యంగా భావించి ఏదో ఒక పథకంలో మదుపు చేస్తుంటారు. తీరా చూస్తే వాటిలో రాబడి అంతంత మాత్రంగానే ఉన్నా, పెట్టుబడి మాత్రం ఖరీదుగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఇంకా తమ పన్ను ఆదా పెట్టుబడులు పూర్తి చేయని ఐటీ చెల్లింపుదారులు ఈ కింది జాగ్రత్తలు పాటించడం మంచిది.

పరిమితి కంటే తక్కువ పెట్టుబడులు

పాత ఆదాయ పన్ను పథకాన్ని వినియోగించుకునే ఐటీ చెల్లింపుదారులు పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద చేసే పెట్టుబడుల్లో రూ.1.5 లక్షల వరకు, సెక్షన్ 80 సీసీడీ (1బీ) కింద ఎన్‌పీఎస్‌లో మదుపు చేస్తే మరో రూ.50,000 వరకు మినహాయింపు లభిస్తుంది. ఇవి కాకుండా తన కోసం, కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియం, గృహ, విద్యా రుణాలపై చెల్లించే వడ్డీకి కూడా ఆదాయ పన్ను మినహాయింపు లభిస్తుంది. ఐటీ రిటర్న్ ఫైల్ చేసే వారిలో చాలా మందికి ఈ విషయాలు తెలియవు. దాంతో తమ ఆదాయ పరిమితి మినహాయింపు పరిమితి కంటే తక్కువ పెట్టుబడులను క్లెయిమ్ చేస్తుంటారు. చక్కటి ప్లానింగ్‌తో ఈ పరిమితిని ఉపయోగించుకుంటే పన్ను ఆదాతో పాటు, పెట్టుబడులపై మంచి రాబడులూ పొందే అవకాశం ఉంటుంది. మరి కొంత మంది వివిధ సెక్షన్ల కింద లభించే మినహాయింపులపై అవగాహన లేక తమ పరిమితికి మించి పెట్టుబడులు పెడుతుంటారు. దీని వల్ల పెట్టుబడులు ఆయా పథకాలను బట్టి మూడు నుంచి ఐదేళ్ల పాటు లాక్ అయిపోతాయి.



ప్రణాళికా రహిత పెట్టుబడులు

ఆర్థిక ప్రణాళికకు మరో పేరే టాక్స్ ప్లానింగ్. ఐటీ చెల్లింపుదారులు, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా పథకాల మంచి చెడులను కూలంకషంగా తెలుసుకుని మాత్రమే పెట్టుబడులు పెట్టాలి. ముఖ్యంగా ఎన్‌పీఎస్, సెక్షన్ 80 సీ పెట్టుబడి పథకాలు ఎంచుకోవాలి. ఈక్విటీ మార్కెట్ ఆటుపోట్లకు సిద్ధమైతే ఈఎల్ఎస్ఎస్ పథకాలు, రిటైర్మెంట్ కోసమైతే ఎన్‌పీఎస్ పథకాలు ఎంచుకోవాలి. ఏ మాత్రం నష్ట భయాన్ని తట్టుకోలేకపోతే ఎన్ఎస్‌సీ లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలను ఎంచుకోవాలి. ఏదేమైనా టాక్స్ ప్లానింగ్ ఆయా వ్యక్తుల దీర్ఘకాలిక పెట్టుబడి లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి.

హడావిడి వద్దు

బ్యాంక్ రిలేషన్‌షిప్ మేనేజర్ లేదా బీమా ఏజెంట్లతో ఎంత పరిచయం ఉన్నా, తొందరపడి పెద్ద మొత్తంలో దీర్ఘకాలిక పెట్టుబడులకు కమిట్ కావద్దు. దీర్ఘకాలిక ఆలోచనతోనే జీవిత బీమా పాలసీలు తీసుకోవాలి. పాలసీ గడువు కంటే ముందే పాలసీ నుంచి తప్పుకుంటే పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి ఉంటుంది. మనకు ఎంత కవరేజి కావాలి, పాలసీ గడువు ముగిసే వరకు ప్రీమియం చెల్లించగలమా, లేదా; పాలసీపై వచ్చే 5-6 శాతం రాబడులపై తృప్తి పడగలమా అనే విషయాలు అన్నీ ఆలోచించుకున్న తర్వాతే జీవిత బీమా పాలసీలు తీసుకోవాలి. టాక్స్ ప్లానింగ్ కోసం యులిప్స్‌లో మదుపు చేస్తున్నా, వాటిపై రాబడులు మార్కెట్ పనితీరుపై ఆధారపడి ఉంటాయనే విషయాన్ని మర్చిపోవద్దు.

నష్ట భయం ఉండే పెట్టుబడులు

ఈక్విటీ మార్కెట్లు జోరు మీద ఉండడంతో ఈఎల్ఎస్ఎస్ పథకాలు గత ఏడాది సగటున 37.4 శాతం, గత మూడేళ్లలో సగటున 18.1 శాతం రాబడులు పంచాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని సెక్షన్ 80సీ కింద లభించే రూ.1.5 లక్షల ఆదాయ మినహాయింపునకు ఉన్న మొత్తాన్ని ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో మదుపు చేయవద్దు. ఎందుకంటే స్టాక్ మార్కెట్ ఇప్పటికే హీటెక్కి ఉంది. స్మాల్ అండ్ మిడ్‌క్యాప్ కంపెనీల షేర్లు తీవ్రంగా నష్టపోతున్నాయి. దీంతో సూచీలూ దిద్దుబాటుకు లోనవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో రూ.50,000 నుంచి రూ.60,000కు మించి పెట్టుబడి పెట్టవద్దు. మిగతా మొత్తాన్ని సురక్షితమైన పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ లేదా టాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మదుపు చేయండి.

అవగాహన

టాక్స్ సేవింగ్ పెట్టుబడుల రాబడులపై పన్ను పోటు ఉంటుందా, లేదా అనే విషయం కూడా మదుపరులు తెలుసుకుని ఉండాలి. ఎన్ఎస్‌సీ రాబడులపై పన్ను పోటు ఉంటుంది. ఈఎల్ఎస్ఎస్ పథకాలపై వచ్చే రాబడులపై రూ.లక్ష వరకే పన్ను మినహాయింపు లభిస్తుంది. అంతకు మించిన రాబడులపై 10 శాతం చొప్పున పన్నుపోటు తప్పదు. ఈ విషయాలన్నీ తెలుసుకున్న తర్వాతే టాక్స్ సేవింగ్ పథకాల్లో మదుపు చేయాలి.